www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
28 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 232

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## 288 మంది భారతీయులు గల్లంతు!

- ఇప్పటివరకు 21 మంది భారతీయుల రక్షణ
- చైనా వైపు మరో 150 మంది భారతీయుల గల్లంతు
- వరదల్లో 270 మంది మృతి.. వేలాది మంది గల్లంతు
- హిమనీ సరస్సు బద్దలవడంతోనే జలప్రళయం
- నేపాల్‌కు 10 టన్నుల సహాయక సామగ్రి పంపిన భారత్

03

నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతు



జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో
## వైద్యుల కొరత

- మృతదేహాలకు పోస్ట్ మార్టం ఆలస్యం
- ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరి మృతదేహాలకు రాత్రి వరకు పోస్టుమార్టం చేయని వైనం
- డ్యూటీ డాక్టర్, సూపరింటెండెంట్, ఆర్ఎంవో అందుబాటులో లేక కుటుంబ సభ్యుల ఆందోళన

06



## రోడ్డుపైకి గ్రామసభ.. ఇదేనా పాలన తీరు?

- బేతోలులో అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ప్రజా సమస్యలపై చర్చించేందుకు భవనం కూడా కరువు
- ప్రజా సమస్యలపై చర్చించాల్సిన గ్రామసభే రోడ్డున పడింది.. ఇదేనా పాలనా తీరు?
- ప్రభుత్వ భవనాలు ఉన్నా ఉపయోగం లేదు
- అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపైనే గ్రామసభ
- శిథిలావస్థకు చేరిన భవనాలు.. పిచ్చిమొక్కల మధ్య ప్రజలకు తప్పని అవస్థలు.
- కనీస సౌకర్యాలు కల్పించలేని అధికారులపై బేతోలు గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం

07



# జనసేనలోకి కొండా, రాజాసింగ్?

## సురేఖపై చర్యలకు సిఫారసు

- హైకమాండ్ నిర్ణయంపై ఉత్కంఠ
- జనసేనలో చేరికపై ప్రచారం
- శంకర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- కొండా కుటుంబానికి జనసేన ఆహ్వానం
- వరంగల్‌లో రాజకీయ సమీకరణాలపై ఆసక్తి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. క్రమశిక్షణా సంఘం సిఫారసు నేపథ్యంలో చర్యలు తప్పవనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. ఇదే సమయంలో సురేఖ కుటుంబం జనసేన వైపు వెళ్తుందన్న ప్రచారం బలపడటం తెలంగాణ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అంశంగా మారింది. కొండా మురళి మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని చెప్పడం ఈ ఊహాగానాలకు భిన్నమైన సంకేతాన్ని ఇచ్చింది. దీంతో కుటుంబం తుది నిర్ణయం ఏంటన్నది ఆసక్తికరంగా మారింది. సురేఖకు కాంగ్రెస్‌లో ఎలాంటి అవకాశం మిగులుతుందన్నది అధిష్ఠానం చర్యల తరువాతే స్పష్టమవుతుంది. అప్పటివరకు రాజకీయ వర్గాల్లో చర్చలు కొనసాగనున్నాయి. ముఖ్యంగా వరంగల్‌లో కొండా కుటుంబానికి ఉన్న రాజకీయ ప్రభావం కారణంగా వారి నిర్ణయాన్ని పలు పార్టీలు కూడా ఆసక్తిగా గమనిస్తున్నాయి. జనసేన వ్యాఖ్యలు మిగతా 2లో..

తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు కీలక చర్చగా మారింది. పార్టీ క్రమశిక్షణా సంఘం సురేఖపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ నిర్ణయంపై ఉత్కంఠ పెరిగింది. ఇప్పటికే ఆమె రాజకీయ భవిష్యత్‌పై వివిధ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సుస్మితతో కలిసి జనసేనలో చేరే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే ఈ ప్రచారానికి కుటుంబం నుంచి స్పష్టమైన ప్రకటన ఇంకా రాలేదు. తాజాగా కొండా మురళి డిప్యూటీ సీఎం భట్టిని కలిసి కాంగ్రెస్‌ను వీడే ఆలోచన లేదని చెప్పడం పరిస్థితిని మరింత ఆసక్తికరంగా మార్చింది. హైకమాండ్ నిర్ణయం వచ్చిన తరువాత సురేఖ తన తదుపరి కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. ఈ పరిణామాల మధ్య జనసేన నేత శంకర్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు చర్చకు కేంద్రంగా మారాయి. దీంతో కొండా కుటుంబ రాజకీయ అడుగులపై ఉత్కంఠ కొనసాగుతోంది.

## అనుముల రేవంత్ కాదు.. ఆంధ్రా రేవంత్!



- రేవంత్‌పై కవిత తీవ్ర విమర్శలు
- బ్రాహ్మణ పరిషత్ పదవులపై అభ్యంతరం
- యాదాద్రి బోర్డుపై సంచలన ఆరోపణలు
- హరీశ్ రావుపై క్విడ్ ప్రో కో డిమాండ్
- ఇనార్బిట్ మాల్ ప్రమాదంపై ఫైర్
- తెలంగాణ సోయి రావాలంటూ డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో కవిత వ్యాఖ్యలు మరోసారి మంటలు రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ నాయకుడిగా కాకుండా ఆంధ్రా రేవంత్ రెడ్డిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాల కంటే ఆంధ్రా నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ పదవిని బసవరాజు శ్రీనివాసరావుకు కట్టబెట్టడాన్ని కవిత ప్రశ్నించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి ఇవ్వడం సరికాదన్నారు. తెలంగాణలో బ్రాహ్మణ మేధావులు లేరా అని నిలదీశారు. రాజకీయ పదవుల్లో స్థానికులకు ప్రాధాన్యం ఉండాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పదవులను వెంటనే మార్చి తెలంగాణకు చెందిన అర్హులకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వంపై కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోందని పేర్కొన్నారు. పదవుల విషయంలో ప్రాంతీయ సమతుల్యత పాటించాలని స్పష్టం చేశారు. బ్రాహ్మణ పరిషత్ తెలంగాణ పేద బ్రాహ్మణులకు అండగా నిలవాల్సిన సంస్థ అని కవిత అన్నారు. అయితే అది ఆంధ్రా రౌడీలకు అడ్డాగా మారిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బసవరాజు శ్రీనివాసరావు తెలంగాణ వాదులపై తీవ్రంగా మాట్లాడారని ఆరోపించారు. దళిత మహిళలు, తెలంగాణ ప్రజలను ఇష్టమొచ్చినట్లు తిట్టారని విమర్శించారు. అలాంటి వ్యక్తికి కీలక పదవి కొనసాగించడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాల్లో మిగతా 2లో..

## ఆరు డీఏలు.. పీఆర్సీ ఎక్కడ?



- ఆరు డీఏలు పెండింగ్‌పై హరీశ్ రావు ఫైర్
- సీపీఎస్ రద్దు హామీ ఎక్కడంటూ ప్రశ్న
- పీఆర్సీపై ప్రభుత్వానికి నిలదీత
- ఈహెచ్ఎస్ అమలులో జాప్యంపై ఆగ్రహం
- రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో 15 శాతం కమీషన్ ఆరోపణ
- ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండ

02

## పాలకుర్తి కాంగ్రెస్‌లో కుతకుత..!

- 2023లో యశస్విని రెడ్డి సంచలన విజయం
- కాంగ్రెస్‌లో ముదురుతున్న వర్గపోరు
- ఝాన్సీ రెడ్డిపై అసంతృప్తి పెరుగుదల
- హరి ప్రసాద్ వర్గంతో విభేదాలు
- పాలకుర్తిలో మళ్లీ బలపడుతున్న బీఆర్ఎస్
- కాంగ్రెస్‌కు గెలుపును కాపాడుకోవడమే సవాల్





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పాలకుర్తి రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి గెలుపు ఇచ్చిన ఊపు ఇప్పుడు కనిపించడం లేదన్న చర్చ మొదలైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో యశస్విని రెడ్డి సంచలన విజయం సాధించి సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించారు. దయాకర్ రావు గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన అనుభవజ్ఞుడు. ఓటమి ఎరుగని నేతగా, మిగతా 3లో..

## మీరాలం చెరువులో వాటర్ స్పోర్ట్స్

- మీరాలం చెరువుకు రూ.430 కోట్లతో అభివృద్ధి
- 2.65 కి.మీ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం
- వాటర్ స్పోర్ట్స్, బోటింగ్‌కు భారీ ప్లాన్
- చెరువు మధ్య ఐలాండ్‌కు కొత్త రూపం
- మురుగునీరు, వరదల నియంత్రణకు చర్యలు
- 2027 చివరి నాటికి పనులు పూర్తి లక్ష్యం

02





## అవినీతిలో అనకొండ..!

- జయరాజుపై ఏసీబీ భారీ సోదాలు
- ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- రూ.3 కోట్ల ఆస్తులు గుర్తింపు
- మార్కెట్ విలువ రూ.70 కోట్ల అంచనా
- డ్రైవర్ ఖాతా నుంచి రూ.24.80 లక్షల బదిలీ
- అక్రమ ఇసుక రవాణా, వసూళ్లపై దర్యాప్తు

03

## పెద్దపల్లి రాఖీకి గ్లోబల్ క్రేజ్

- పెద్దపల్లి రాఖీలకు ప్రత్యేక గుర్తింపు.. 30 వేలకుపైగా డిజైన్లు
- 25 రాష్ట్రాలకు సరఫరా.. అమెరికా, బ్రిటన్‌కు ఎగుమతులు
- 3 వేలకుపైగా మహిళలకు ఉపాధి.. ఇంటి నుంచే పని చేసే అవకాశం

03





## స్క్రీన్‌లు కావు... మైదానాలే ముఖ్యం

- దేశ యువతకు మోదీ పిలుపు
- ఖేలో ఇండియా కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు
- ఒలింపిక్స్‌లో భారత ప్లేయర్ల భాగస్వామ్యంపై నిరాశ

02

## విద్యార్థుల గొంతు నొక్కేస్తారా?

- పాలిటెక్నిక్ విద్యార్థులకు బీజేపీ అండ
- రాంచందర్‌రావుకు గృహ నిర్బంధం
- కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఫైర్
- పాలిటెక్నిక్ కోర్సుపై కీలక ప్రశ్నలు
- విద్యార్థుల ఉద్యమానికి నైతిక మద్దతు

02



# మీరాలం చెరువులో వాటర్ స్పోర్ట్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ పాతబస్తీకి కొత్త టూరిజం ఫేస్ రాబోతోంది. చారిత్రక మీరాలం చెరువు రూపు రేఖలు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికను అమలు చేస్తోంది. రూ.430 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు 2027 చివరి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టులో భాగంగా చెరువు చుట్టూ ఆధునిక సౌకర్యాలు, పర్యాటక ఆకర్షణలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు రూపుదిద్దుకుంటున్నాయి. శాస్త్రిపురం నుంచి చింతలమెట్ రోడ్డును కలుపుతూ 2.65 కిలోమీటర్ల కేబుల్ బ్రిడ్జి నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మురుగునీరు చెరువులోకి చేరకుండా ఎస్టీపీల ఏర్పాటుతో పాటు వరద నీటి నిర్వహణకు పటిష్ట చర్యలు కొనసాగుతున్నాయి. వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, పబ్లిక్ స్పేస్‌లు, కుటుంబాల వినోదానికి అనువైన ప్రాంతాలు కూడా ప్రణాళికలో ఉన్నాయి. దీంతో దుర్గం చెరువుకు భిన్నంగా పాత బస్తీకి కొత్త ఐకానిక్ ల్యాండ్‌మార్క్ రూపుదిద్దుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి మీరాలం అభివృద్ధిపై ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉదయం మీరాలం చెరువును ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి నిర్మాణ దశలు, మౌలిక వసతులు, భవిష్యత్ ప్రణాళికలపై వివరాలు తెలుసుకున్నారు. భారీ క్రేన్‌పై నుంచి చెరువు పరిసరాలను పరిశీలించిన సీఎం, బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు అభివృద్ధి కేవలం అందమైన నిర్మాణాలకే పరిమితం కాకూడదని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, వరద నియంత్రణ, ప్రజలకు ఉపయోగపడే సౌకర్యాలు సమాంతరంగా ముందుకు సాగాలని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సందర్శకులు సురక్షితంగా, సౌకర్యవంతంగా గడిపేలా మార్గాలు, పబ్లిక్ స్పేస్‌లు, అవసరమైన మౌలిక వసతులు సిద్ధం చేయాలని



సూచించారు. సీఎం ఆకస్మిక తనిఖీతో ప్రాజెక్టుపై అధికార యంత్రాంగంలో ఫోకస్ మరింత పెరిగింది. పనుల పురోగతిపై అధికారులు దృష్టి పెట్టనున్నారు. మీరాలం చెరువు భవిష్యత్ రూపకల్పనలో సస్పెన్షన్ బ్రిడ్జి ప్రధాన హైలైట్‌గా మారనుంది. 2.65 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెన పూర్తయితే శాస్త్రిపురం, చింతలమెట్ ప్రాంతాల మధ్య రాకపోకలకు కొత్త మార్గం ఏర్పడుతుంది. అదే సమయంలో చెరువు అందాలను వీక్షించే ప్రత్యేక అనుభూతి సందర్శకులకు లభించనుంది. సాయంత్రం వేళల్లో లైటింగ్, అందమైన పరిసరాలు, కుటుంబాల కోసం పబ్లిక్ స్పేస్‌లు ఆకర్షణగా నిలిచే అవకాశం ఉంది. చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహణకు ప్రత్యేక డిజైన్ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. బోటింగ్‌కు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్‌ను కూడా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ఆలోచన ఉంది. ఐలాండ్‌లో ఆకర్షణీయమైన సౌకర్యాలు, వీక్షణ ప్రాంతాలు, సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లు తీసుకురావాలని అధికారులు ప్రణాళికలు రూపొందించనున్నారు. యువతకు వినోదం, కుటుంబాలకు విహారం, పర్యాటకులకు కొత్త అనుభూతి కలిగించేలా మొత్తం ప్రాంతాన్ని డిజైన్ చేయనున్నారు. ఇవన్నీ పూర్తయితే మీరాలం చెరువు హైదరాబాద్‌లో మరో నగర ప్రజలకు వారాంతాల్లో సందర్శించేందుకు కొత్త గమ్యం సిద్ధమవుతుంది. అభివృద్ధితో పాటు చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోంది. మీరాలం చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ నెట్‌వర్క్‌ను మెరుగుపరచి కలుషిత నీటి ప్రవాహాన్ని అడ్డుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. భారీ వర్షాల సమయంలో చెరువులోకి వచ్చే వరద నీరు వేగంగా బయటకు వెళ్లేలా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు వెళ్లే నాలాను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు పెరిగి పరిసర ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు నిర్వహణ కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. ఎస్టీపీల ఏర్పాటు, నీటి నాణ్యత పరిరక్షణ, డ్రైనేజీ మెరుగుదల, వరద ప్రవాహ నియంత్రణ వంటి పనులు పర్యాటక అభివృద్ధితో కలసి సాగనున్నాయి. అందమైన నిర్మాణాల వెనుక బలమైన పర్యావరణ వ్యవస్థ ఉండేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. చెరువు నీరు స్వచ్ఛంగా ఉంటేనే వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ వంటి కార్యకలాపాలు విజయవంతమవుతాయి. అందుకే మౌలిక వసతులతో పాటు నీటి భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోంది. నీటి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ డెవలప్‌మెంట్, పబ్లిక్ స్పేస్‌లు, మెరుగైన డ్రైనేజీ, వరద నిర్వహణ కలిస్తే మీరాలం చెరువు కొత్త రూపంలో కనిపించనుంది. ఒకప్పుడు నగరంలోని సాధారణ నీటి వనరుగా కనిపించిన ఈ ప్రాంతం, భవిష్యత్తులో కుటుంబాల విహారయాత్రలకు, యువత వినోదానికి, పర్యాటకుల సందర్శనకు ప్రత్యేక కేంద్రంగా మారవచ్చు. ముఖ్యమంత్రి స్వయంగా పనులను పరిశీలించడం ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యాన్ని చూపిస్తోంది. 2027 చివరి గడువు దృష్ట్యా నిర్మాణ వేగం, నాణ్యత, సమన్వయం కీలకంగా మారనున్నాయి. అనుకున్న విధంగా పనులు పూర్తయితే పాతబస్తీ పర్యాటక ముఖచిత్రంలో మీరాలం చెరువు ప్రత్యేక స్థానాన్ని సంపాదించవచ్చు. దుర్గం చెరువును మించే స్థాయిలో కొత్త ఐకానిక్ స్పాట్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం ఎంతవరకు ఫలిస్తుందో పనుల పూర్తితో స్పష్టమవుతుంది. అయితే ప్రాజెక్టు విజయం కేవలం బ్రిడ్జి లేదా వినోద సౌకర్యాలపై ఆధారపడదు. చెరువు స్వచ్ఛత, వరద నియంత్రణ, ప్రజా సౌకర్యాలు, నిర్వహణ కూడా అంతే కీలకం. హైదరాబాద్ పర్యాటక రంగానికి మీరాలం కొత్త ఆకర్షణగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## స్క్రీన్‌లు కావు... మైదానాలే ముఖ్యం

**న్యూఢిల్లీ:**

డిజిటల్ స్క్రీన్లు, ప్లేస్టేషన్లకు (ఆన్‌లైన్ గేమింగ్ స్టేషన్లు) పరిమితం కాకుండా క్రీడలను తమ రోజువారీ జీవితంలో భాగంగా మార్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతకు పిలుపునిచ్చారు. స్క్రీన్‌ల కంటే స్పోర్ట్స్ సెంటర్లే ముఖ్యమని అన్నారు. గ్రౌండ్‌లోకి దిగితేనే ఓటమిని తట్టుకుని తిరిగి నిలబడే 'స్పోర్ట్స్ స్పిరిట్', ఓర్పు అబ్బుతాయని మోదీ చెప్పారు. ఈ సంస్కృతి మెరుగైన సమాజానికి అత్యవసరమని చెప్పారు. క్రీడలు యువతను మంచి కేరక్టర్ సాధించడానికి ఉపయోగపడతాయని, అంతేకాకుండా, దేశాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వ్యాఖ్యానించారు. శనివారం మొదలుకానున్న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన 'ఖేలో ఇండియా డయలాగ్'లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పాల్గొన్నారు. అథ్లెట్లు, విద్యార్థులు, వలంటీర్లను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలు కేవలం పతకాల వేట కోసం మాత్రమే కాదని, వికసిత్ భారత్ నిర్మాణంలో యువశక్తిని భాగస్వామ్యం చేసే ప్రక్రియ ఇదని ప్రధాని ఈ సందర్భంగా చెప్పారు. స్కూళ్లు క్రీడలను కేవలం ఒక పాఠ్యేతర అంశంగా చూడొద్దని సందేశం ఇచ్చారు. ప్రస్తుతం కెరీర్ టైమ్‌టేబుల్‌లో చదువుతో పాటు క్రీడలకు చోటు ఉంటుందని, దీంతో, భారత్ స్పోర్టింగ్ భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచుతోందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. క్రీడలు ఆడేవారే వికసిస్తారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ కూడా పాల్గొన్నారు. ఒలింపిక్స్ గేమ్స్‌లో భారత ప్లేయర్ల భాగస్వామ్యంపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఒలింపిక్స్‌లో ఉండే సగం పోటీల్లో భారత్ కనీసం పోటీ పడడంలేదని, భారత్‌కు పతకాల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమని ఇదేనని చెప్పారు.





## జనసేనలోకి కొండా, రాజాసింగ్?

**మొదటి పేజీ తరువాయి**

ఈ చర్చకు కొత్త ఊపునిచ్చాయి. ఇదే అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో విస్తృతంగా చర్చకు కారణమైంది. జనసేన తెలంగాణ ఇన్‌చార్జ్ శంకర్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండా సుస్మిత, కొండా మురళి, కొండా సురేఖ జనసేనలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని ఆయన స్పష్టం చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కొండా కుటుంబం తమ పార్టీలో చేరితే వరంగల్ ప్రాంతంలో జనసేన బలం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలతో ఇప్పటివరకు ప్రచారంగా ఉన్న అంశానికి రాజకీయంగా మరింత బలం వచ్చినట్లైంది. అయితే చేరికపై కుటుంబం నుంచి అధికారిక ప్రకటన లేకపోవడంతో దీనిని తుది నిర్ణయంగా చూడలేం. అయినప్పటికీ జనసేన తలుపులు తెరిచి ఉన్నాయన్న సంకేతం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. సురేఖపై కాంగ్రెస్ నిర్ణయం వెలువడిన తరువాత పరిస్థితి ఏ దిశలో వెళ్తుందో చూడాలి. ఆమె కుమార్తె సుస్మిత రాజకీయ అడుగు కూడా ఈ పరిణామాల్లో కీలకంగా మారే అవకాశం ఉంది. రాజకీయ పరిశీలకులు కూడా ఈ పరిణామాన్ని ఆసక్తిగా గమనిస్తున్నారు. తెలంగాణలో జనసేన విస్తరణకు కొండా కుటుంబం చేరిక ఉపయోగపడుతుందని శంకర్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు పార్టీ వ్యూహాన్ని కూడా సూచిస్తున్నాయి. వరంగల్ వంటి రాజకీయంగా ప్రాధాన్యమైన ప్రాంతంలో బలమైన కుటుంబం చేరితే స్థానికంగా పార్టీకి కొత్త ఊపు వస్తుందని జనసేన భావిస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పవన్ కల్యాణ్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని శంకర్ గౌడ్ చెప్పడం కూడా ఆసక్తికరంగా మారింది. ప్రజారాజ్యం పార్టీలో గతంలో పనిచేసిన నేతలు, యువత, మేధావులు తమతో సంప్రదింపుల్లో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన తన సత్తా చూపుతుందని ధీమా వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణలో పార్టీ విస్తరణ ప్రయత్నాలు వేగం పుంజుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొండా కుటుంబం నిర్ణయం జనసేనకు ఎంతవరకు రాజకీయ లాభం తీసుకొస్తుందన్నది కీలకంగా మారింది. కాంగ్రెస్‌లో పరిణామాలు దీనికి దిశానిర్దేశం చేయనున్నాయి. ప్రస్తుతం కొండా కుటుంబం నుంచి వచ్చే తదుపరి ప్రకటనపైనే అందరి దృష్టి ఉంది. కాంగ్రెస్ అధిష్ఠానం సురేఖపై చర్యలు తీసుకుంటే ఆమె రాజకీయ భవిష్యత్ ఎలా ఉండబోతుందన్నది కీలకంగా మారుతుంది. మరోవైపు కుటుంబం కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని కొండా మురళి చెప్పడం వల్ల జనసేన చేరిక ప్రచారానికి కొంత సందిగ్ధత ఏర్పడింది. అయినప్పటికీ శంకర్ గౌడ్ స్వాగత వ్యాఖ్యలు రాజకీయ చర్చను మరింత వేడెక్కించాయి. సుస్మిత రాజకీయంగా ముందుకు వస్తారా, సురేఖ తన ప్రస్తుత పార్టీలోనే కొనసాగుతారా, లేక కొత్త రాజకీయ మార్గాన్ని ఎంచుకుంటారా అన్నది త్వరలో స్పష్టమయ్యే అవకాశం ఉంది. వరంగల్ రాజకీయాల్లో కొండా కుటుంబానికి ఉన్న ప్రభావం దృష్ట్యా వారి నిర్ణయం స్థానిక సమీకరణాలను ప్రభావితం చేయొచ్చు. గ్రేటర్ ఎన్నికల ముందు జనసేనకు ఈ పరిణామం ప్రచారపరంగా కూడా ఉపయోగపడే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడు హైకమాండ్ నిర్ణయం, కొండా కుటుంబ స్పందన రెండింటిపైనా రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# ఆరు డీఏలు.. పీఆర్సీ ఎక్కడ?



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. దేశంలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉంచిన ఏకైక ప్రభుత్వం ఇదేనని విమర్శించారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీ అమలు, ఈహెచ్‌ఎస్ వంటి కీలక అంశాల్లో స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే ఉద్యోగులు ఇప్పుడు కోరుతున్నారని స్పష్టం చేశారు. హనుమకొండ కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోల ధర్నాలో పాల్గొన్న ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్యోగుల ఆందోళనను ప్రభుత్వం తేలికగా తీసుకోవద్దని సూచించారు. సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం పనిచేసే సిబ్బందికి భరోసా కల్పించడం పాలకుల బాధ్యతగా పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు కోరారు. సీపీఎస్ ఉద్యోగులను ఓపీఎస్‌లోకి మారుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు సమీపిస్తున్నా ఆ హామీ నెరవేరలేదని అన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి ఈహెచ్‌ఎస్ కోసం డబ్బులు కట్ చేస్తున్నా వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. గతంలో ఒక శాతం కాంట్రిబ్యూషన్‌తో ఆరోగ్య భద్రత కల్పించామని, ఇప్పుడు దాన్ని 1.5 శాతానికి పెంచినా ప్రయోజనం కనిపించడం లేదన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఇద్దరి జీతాల నుంచి కోత పడుతోందని, రిటైర్డ్ తల్లిదండ్రుల కోసం కూడా డబ్బులు తీసుకుంటున్నారని తెలిపారు. ఆసుపత్రులతో ఒప్పందాలు లేకపోవడమే అమలులో జాప్యానికి కారణమని ఆరోపించారు. పీఆర్సీ ప్రక్రియను వేగవంతం చేసి ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తగ్గించాలని కోరారు. సీపీఎస్ రద్దుపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్‌కు ఆసుపత్రులతో వెంటనే ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. సిద్దిపేటకు చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ ఖాజా మొయినొద్దీన్ తండ్రికి గుండెపోటు వచ్చినప్పుడు ఈహెచ్‌ఎస్ సదుపాయం లేదంటూ ఆసుపత్రులు వెనక్కి పంపాయని హరీశ్ రావు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వచ్చిన రూ.11 లక్షల బిల్లును తగ్గించేందుకు తాను వ్యక్తిగతంగా మాట్లాడాల్సి వచ్చిందన్నారు. ఆరోగ్యశ్రీ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని ఆసుపత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ధరలు తమకు గిట్టుబాటు కావడం లేదని ఆసుపత్రులు చెబుతున్నాయని వివరించారు. ఉద్యోగుల జీతాల నుంచి డబ్బులు కట్ చేస్తూ సేవలు ఇవ్వకపోవడం ఏ న్యాయమని ప్రశ్నించారు. ఈహెచ్‌ఎస్ అమలులో జాప్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో ఆలస్యం మరింత భారాన్ని పెంచుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని కోరారు. జీతాల కోతకు తగ్గ సేవలు అందాలని స్పష్టం చేశారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 15 శాతం కమీషన్ అడుగుతున్నారనే ఆరోపణలు సోషల్ మీడియాలో రావడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు వారినే ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 73 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇచ్చి ఉద్యోగులను గౌరవించిందని గుర్తుచేశారు. సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఎదురవుతున్న ఆంక్షలను కూడా ఆయన ప్రస్తావించారు. జీపీఎఫ్ లోన్లు, బెనిఫిట్స్ వంటి అంశాలపై స్పందించే పరిస్థితి లేదని ఆరోపించారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలని కోరారు. ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం నేరుగా చర్చలు జరపాలని కోరారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీల అమలుపై కాలపరిమితితో కూడిన ప్రణాళిక ఇవ్వాలని సూచించారు. ఉద్యోగులతో ప్రభుత్వం వెంటనే తక్షణ చర్చలు జరపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పెట్టుకుంటే ప్రభుత్వానికి రోజులు దగ్గరపడతాయని హరీశ్ రావు హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు, జీవో 97పై పాలిటెక్నిక్ విద్యార్థులు, జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు రోడ్డెక్కారని తెలిపారు. మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కారం కాలేదని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు గ్రాట్యుటీ అందలేదని అన్నారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. అంగన్‌వాడీల సమస్యలపైనా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్ రావు ప్రకటించారు. ప్రభుత్వ హామీలు అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆకాంక్షలను గౌరవించాలని సూచించారు. హామీలను కార్యరూపంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందన లేకుంటే ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని హెచ్చరించారు. హామీలను అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ముందుకు రావాలని ఆయన కోరారు.

## సెప్టెంబర్ 19,20 తేదీలలో... ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశాలు

పాల్వంచ విశాల భారతి: ఆగస్టు 27:<ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 19,20 తేదీలలో బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయాలో జరుగుతాయని ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు. అదే విధంగా అక్టోబర్ 28న ఐఎఫ్ డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు దేశవ్యాపిత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో పాత్రికేయుల రక్షణకు ప్రత్యేక చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రైల్వే రాయితీ పునరుద్ధరణ తదితర డిమాండ్ల సాధనకై తలపెట్టిన ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జర్నలిస్టులను సమీకరించడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 19,20 తేదీలలో బోధ్ గయాలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు గోపాల్ మిశ్రా అధ్యక్షతన బోధ్ గయాలో జరిగే ఈ రెండు రోజుల జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ఆయా రాష్ట్రాల సమస్యలు, జాతీయ స్థాయి జర్నలిస్టుల సమస్యల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని మామిడి సోమయ్య తెలిపారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులు, రక్షణ చట్టాలు తదితర అంశాలపై జాతీయ సమావేశాలో చర్చించడం జరుగుతుందని తెలిపారు.

# విద్యార్థుల గొంతు నొక్కేస్తారా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థుల సమస్యలపై గళమెత్తిన తనను తార్నాక నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలకు బయలుదేరిన సమయంలో అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. తన గొంతును అణచాలని ప్రభుత్వం భావిస్తే అది కాంగ్రెస్ భ్రమేనని స్పష్టం చేశారు. విద్యా రంగం మొత్తం అంధకారంలోకి వెళ్లిందని, విద్యార్థులకు ఫీజులు అందడం లేదని, ఆయుష్ విద్యార్థులకు స్టైఫండ్ సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అహంకార ధోరణితో విద్యార్థుల ఉద్యమాన్ని అణిచివేస్తోందని మండిపడ్డారు. ఎమర్జెన్సీ మైండ్‌సెట్‌తో ప్రతిపక్ష నేతలను నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఆవేదనను ప్రభుత్వం వెంటనే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. విద్యార్థుల తరపున నిరంతర ప్రజాస్వామ్య పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల విద్యార్థుల సమస్యలపై రెండు రోజుల నిరాహార దీక్ష చేపట్టినప్పుడు వేలాది మంది విద్యార్థులు తరలివచ్చి తమ గళాన్ని వినిపించారని రాంచందర్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడు పాలిటెక్నిక్ విద్యార్థుల పిలుపు మేరకు వారికి నైతిక మద్దతు ఇవ్వడానికి వెళ్తుంటే ప్రభుత్వం అడ్డుకోవడం ఆందోళనకరమన్నారు. తెలంగాణలో పాలిటెక్నిక్, ఆయుష్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులు వరుస నిరసనలకు దిగుతున్నా కాంగ్రెస్ పెద్దలకు వారి గూంజ్ వినిపించడం లేదని విమర్శించారు. విద్యార్థుల సంక్షేమం కాంగ్రెస్ ప్రాధాన్యాల్లో లేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ తెలంగాణ విద్యార్థుల సమస్యలను విస్మరించారని అన్నారు. సమాజంలోని వివిధ వర్గాల విద్యార్థులు తమ హక్కుల కోసం రోడ్డెక్కుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు బీజేపీ విద్యార్థుల పక్షాన నిలుస్తుందని చెప్పారు. ఉద్యమాలను అణచడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చలతో పరిష్కారం సాధ్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయ ప్రయోగాలు చేయొద్దని సూచించారు. వారి డిమాండ్లకు పరిష్కారం చూపాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెయ్యి కోట్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి ఏడాది గడిచినా ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదని రాంచందర్‌రావు ఆరోపించారు. టీచర్లకు జీతాలు చెల్లించేందుకు డబ్బులు లేవని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పిన పరిస్థితి విద్యా వ్యవస్థ దుస్థితిని తెలియజేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. విద్యార్థుల అంశంపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని గతంలోనే చెప్పామని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పదిహేను వేల కోట్లకు చేరడం తీవ్ర ఆందోళనకరమన్నారు. యంగ్ ఇండియా స్కూల్స్ పేరుతో ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, విద్యార్థుల ప్రస్తుత సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యా సంస్థలకు నిధులు విడుదల చేసి, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని కోరారు. విద్యా రంగాన్ని రాజకీయ వేదికగా మార్చవద్దని హితవు పలికారు. ప్రభుత్వ బాధ్యతను గుర్తుచేస్తుందని చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సు కూడా నైపుణ్యాభివృద్ధికి కీలకమైన విద్యా మార్గమని రాంచందర్‌రావు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులను బీటెక్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. ప్రభుత్వం నిర్ణయం సరైనదని భావిస్తే మళ్లీ కమిటీ ఎందుకు ఏర్పాటు చేసిందని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కాలేజీలను రద్దు చేసి వాటి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల చదువుకు అడ్డంకులు సృష్టించే ప్రతి నిర్ణయాన్ని బీజేపీ ప్రశ్నిస్తుందని చెప్పారు. నైపుణ్య విద్యకు ప్రాధాన్యం పెంచాల్సిన సమయంలో పాలిటెక్నిక్ వ్యవస్థను బలహీనపరచడం రాష్ట్ర యువత భవిష్యత్తుకు నష్టం చేస్తుందన్నారు. విద్యార్థులకు స్పష్టమైన విధానం, మెరుగైన మౌలిక వసతులు, సమయానికి ఫీజు సహాయం అందించాలని కోరారు. కమిటీ నిర్ణయాలను బహిరంగంగా వెల్లడించి, విద్యార్థులతో ప్రభుత్వం నేరుగా చర్చించాలని సూచించారు. అనిశ్చితిని తొలగించి వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. నిర్ణయంపై విద్యార్థులకు స్పష్టత ఇవ్వాలని కోరారు. నిరసనలను అణచివేయడం, ప్రతిపక్షాల గొంతును నొక్కడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని రాంచందర్‌రావు విమర్శించారు. ఇదే సమయంలో ప్రజాస్వామ్యం గురించి తమకు పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో విద్యార్థులు హక్కుల కోసం పోరాడుతున్నారని, ప్రస్తుత ఆందోళనలు అంతం కాదని, ఇది ఆరంభం మాత్రమేనని హెచ్చరించారు. విద్యార్థుల ఉద్యమంలో రాజకీయ జోక్యం చేయాలన్న ఉద్దేశం బీజేపీకి లేదని స్పష్టం చేశారు. వారి పోరాటానికి నైతిక మద్దతు మాత్రమే ఇస్తామని చెప్పారు. విద్యార్థులను రాజకీయంగా ఉపయోగించుకునే విధానాన్ని పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే గృహ నిర్బంధాలు నిలిపివేసి, విద్యార్థి సంఘాలతో చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి, గడువుతో హామీలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల గళాన్ని ఎంత అణచినా అది మరింత బలంగా వినిపిస్తుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. విద్యా రంగాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్య మార్గంలో బీజేపీ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు.



# అనుముల రేవంత్ కాదు.. ఆంధ్రా రేవంత్!

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణకు చెందిన వ్యక్తులను నియమించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అంశంలో స్పందించిన తీరు, ఇతర విషయాల్లో ఆయన మౌనాన్ని కవిత ప్రశ్నించారు. రెడ్ కో ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల్లో ఆంధ్రా ఆధిపత్యం ఉందని ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో తెలంగాణ ప్రయోజనాలను ముందుకు తేవాలని సూచించారు. స్థానికుల హక్కులు, అవకాశాలు కాపాడటమే ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. యాదాద్రి ఆలయ బోర్డులో ఆంధ్రా హీరో భార్యకు సభ్యత్వం కల్పించడంపైనా కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ భక్తుల డబ్బులతో నిర్మించిన ఆలయంలో స్థానికులకు ప్రాధాన్యం ఉండాలని అన్నారు. తిరుపతి బోర్డులో తెలంగాణవారికి అవకాశం కల్పిస్తే అక్కడి



వ్యవస్థలో మనవారి భాగస్వామ్యం ఉంటుందని వ్యాఖ్యానించారు. బయోకాన్ తెలుగు మాట్లాడినందుకు రెండువందల మందిని తొలగించారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి స్పందించలేదని విమర్శించారు. సంస్థల్లో తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు. నారాయణ కాలేజీలో సంవత్సరం మధ్యలో పలువురిని తొలగించారన్న అంశాన్ని ప్రస్తావించారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అవకాశాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. తెలంగాణ యువతకు ఉపాధి, పరిశ్రమలు, సంస్థల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆంధ్రా అనుకూల విధానాలు కొనసాగితే తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని హెచ్చరించారు. స్థానిక హక్కుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశాన్ని రాజకీయంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. హరీశ్ రావుపై క్విడ్ ప్రో కో కేసు నమోదు చేయాలన్న డిమాండ్‌ను కవిత ముందుకు తెచ్చారు. గత ప్రభుత్వంలో మంత్రి పదవిని ఉపయోగించి సొంత డెయిరీకి లాభం చేకూర్చారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ రంగ డెయిరీకి బదులుగా సంస్థలకు సొంత డెయిరీ ద్వారా పాలు సరఫరా చేసి ఎనిమిదేళ్లలో భారీ వ్యాపారం చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం క్విడ్ ప్రో కో పరిధిలోకి వస్తుందా లేదా ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. చిత్తశుద్ధి ఉంటే దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఐదువందలకు పైగా విద్యార్థులు ఉన్న ప్రతి విద్యాసంస్థకు ప్రభుత్వ, సొసైటీ ఆధ్వర్యంలోని డెయిరీల నుంచి పాలు సరఫరా చేసేలా జీవో ఇవ్వాలని సూచించారు. ప్రైవేటు విధానాలను నిలిపివేయాలని అన్నారు. ప్రభుత్వ వనరులు ప్రజలకు ఉపయోగపడేలా పారదర్శక నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై అధికార పక్షం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆరోపణలపై వర్గాలు వాస్తవాలు వెల్లడించాలని కోరారు.

# పెద్దపల్లి రాఖీకి గ్లోబల్ క్రేజ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రంగురంగుల దారాలు, మెరిసే పూసలు, అందమైన రాళ్లతో పెద్దపల్లి పేరు ఇప్పుడు రాఖీ ప్రపంచంలో ప్రత్యేకంగా వినిపిస్తోంది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి గుర్తుగా కట్టే చిన్న రాఖీ, వేలాది కుటుంబాలకు ఆదాయ మార్గంగా మారింది. ఒకప్పుడు వ్యాపారులు కలకత్తా, రాజస్థాన్ మార్కెట్లపై ఆధారపడితే, ఇప్పుడు పెద్దపల్లి నుంచే దేశవ్యాప్తంగా సరఫరా సాగుతోంది. ఇక్కడ తయారయ్యే రాఖీలు 25 రాష్ట్రాలకు చేరుతున్నాయి. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకూ ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో స్థానిక మహిళల నైపుణ్యానికి అంతర్జాతీయ మార్కెట్ తలుపులు తెరుచుకున్నాయి. పండుగ ఒక్కరోజే జరిగినా, దాని వెనుక నెలల శ్రమ దాగి ఉంది. ఆ శ్రమ కుటుంబాల ఆర్థిక భద్రతకు బలమైన ఆధారంగా నిలుస్తోంది. పెద్దపల్లి రాఖీ తయారీ కేవలం సీజనల్ పని కాకుండా, ప్రత్యేక ఉపాధి రంగంగా వేగంగా రూపుదిద్దుకుంది. స్థానిక కుటుంబాలకు స్థిరమైన ఆదాయ అవకాశాలు పెరిగాయి. వేలాది డిజైన్లతో మహిళలు కొత్త మార్కెట్‌ను సృష్టిస్తున్నారు. పెద్దపల్లిలో రాఖీ తయారీకి ఉన్న వైవిధ్యం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సాధారణ దారం రాఖీల నుంచి పూసలు, ముత్యాలు, చమ్కీలు, పువ్వులు, రంగు రాళ్లతో రూపొందించే డిజైనర్ రాఖీల వరకు ఎన్నో మోడళ్లు ఇక్కడ కనిపిస్తాయి. మహిళల ప్రకారం 30 వేలకుపైగా డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు ప్రతి సీజన్‌లో కొత్త నమూనాలు తయారవుతున్నాయి. ధరలు డిజైన్‌ను బట్టి మారుతున్నాయి. సాధారణ రాఖీలు రూపాయి నుంచి మొదలవుతుండగా, ప్రత్యేక అలంకరణలతో తయారైనవి వందలు, వెయ్యి రూపాయల వరకు చేరుతున్నాయి. రాఖీ తయారీ జనవరి నుంచే మొదలై ఆగస్టు వరకు కొనసాగుతుంది. దాదాపు ఎనిమిది నెలలపాటు ఈ పని మహిళలకు ఆదాయం అందిస్తుంది.



సీజన్‌లో మూడు వేలకుపైగా మహిళలు ఉపాధి పొందుతున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. చిన్న పనిగా మొదలైన రాఖీ తయారీ, పెద్ద స్థాయి జీవనోపాధిగా మారుతోంది. స్థానిక ప్రతిభకు మార్కెట్ విలువ పెరుగుతోంది. తయారీదారులకు కొత్త అవకాశాలు తెరుచుకుంటున్నాయి. ఈ పరిశ్రమలో పెద్దపల్లి మహిళలకు ఇంటి నుంచే పని చేసే అవకాశం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. గతంలో కొంతమంది మహిళలు బీడీలు చుట్టి ఆదాయం సంపాదించేవారు. ఇప్పుడు అదే చేతులతో ఆకర్షణీయమైన రాఖీలు తయారు చేస్తున్నారు. నిర్వాహకులు ముందుగా డిజైన్ ప్రకారం శిక్షణ ఇస్తారు. తర్వాత అవసరమైన ముడిసరుకును ఇళ్లకు అందజేస్తారు. మహిళలు అనుకూలమైన సమయంలో రాఖీలు తయారు చేసి తిరిగి అందిస్తారు. తయారైన సంఖ్య, డిజైన్, పనితీరును బట్టి కూలీ చెల్లిస్తారు. రోజుకు సుమారు మూడు వందల నుంచి ఐదు వందల రూపాయల వరకు సంపాదించే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. గృహిణులు, యువతులు, నిరుద్యోగ మహిళలకు ఇది సౌకర్యవంతమైన ఉపాధిగా మారింది. ఇంటి బాధ్యతలు చూసుకుంటూనే ఖాళీ సమయంలో పని చేయడం వీలవుతోంది. దారం కళగా మారుతోంది. అది కుటుంబ ఆదాయానికి తోడ్పడుతోంది. శిక్షణతో నైపుణ్యం పెరుగుతోంది. సంపాదనతో కుటుంబ ఆర్థిక స్థిరత్వం బలపడుతోంది. ఇదే పెద్దపల్లి రాఖీ పరిశ్రమ ప్రత్యేకతగా నిలిచింది. ఒక రాఖీ వెనుక ఎన్నో ముడిసరుకుల కథ ఉంది. రంగురంగుల దారాలు, పూసలు, ముత్యాలు, గాజు రాళ్లు, ప్లాస్టిక్ రాళ్లు, చమ్కీలు, ప్లాస్టిక్ కాయిన్లు, పువ్వులు, అలంకరణ సామగ్రి అవసరం అవుతాయి. వీటిని గుజరాత్, ముంబై, రాజస్థాన్, చెన్నై, మీరట్ ప్రాంతాల నుంచి సేకరిస్తున్నారు. కొన్ని ప్రత్యేక పూసలు, అలంకరణ వస్తువులు, ప్యాకింగ్ సామగ్రి విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. తయారీతో పని ఆగిపోదు. ముడిసరుకు విభజన, డిజైన్ ఎంపిక, తయారీ, ప్యాకింగ్, నిల్వ, మార్కెటింగ్, రవాణా దశల్లో మహిళల భాగస్వామ్యం ఉంది. కంప్యూటర్ల సహాయంతో కొత్త డిజైన్లు రూపొందిస్తూ మార్కెట్ ట్రెండ్‌కు తగ్గ మోడళ్లు తీసుకొస్తున్నారు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి రాఖీలు తెప్పించుకున్న ప్రాంతాలు, ఇప్పుడు పెద్దపల్లి ఉత్పత్తులకు మార్కెట్లుగా మారాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు సరఫరా జరుగుతోంది. ఆన్‌లైన్ ఆర్డర్లతో వ్యాపారం మరింత విస్తరిస్తోంది. స్థానిక తయారీకి జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తోంది. అన్నాచెల్లెళ్ల ప్రేమకు గుర్తుగా కట్టే రాఖీ, ఇప్పుడు పెద్దపల్లి మహిళల ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. దాని వెనుక ఒక మహిళ శ్రమ, ఒక కుటుంబం ఆశ, ఒక ఇంటి ఆర్థిక భరోసా దాగి ఉంటుంది. పండుగ కోసం నెలల ముందే మొదలయ్యే తయారీ, వేల కుటుంబాల్లో ఆదాయ అవకాశాలను పెంచుతోంది. దేశంలోని 25 రాష్ట్రాలకు చేరుతున్న రాఖీలు, విదేశీ మార్కెట్లలోనూ అడుగుపెడుతున్నాయి. పెద్దపల్లి కథలో ఇంటి వద్దే పని, సృజనాత్మకత, నైపుణ్యానికి విలువ, మార్కెట్ చేరిక కనిపిస్తున్నాయి. రాఖీ పండుగ ఒకరోజు జరగొచ్చు. కానీ దాని ఆర్థిక ప్రభావం ఎన్నో నెలలు కొనసాగుతుంది. అందుకే పెద్దపల్లి రాఖీ పరిశ్రమ, మహిళా శక్తికి రంగురంగుల విజయకథగా నిలుస్తోంది. ఇక్కడి శ్రమకు మార్కెట్ గుర్తింపు లభిస్తోంది. ప్రతి సీజన్‌లో కొత్త అవకాశాలు పుడుతున్నాయి. స్థానిక నైపుణ్యం దేశ విదేశాల్లో గుర్తింపు పొందుతోంది. మహిళల ఆదాయానికి ఈ పరిశ్రమ కీలకంగా మారింది. చిన్న వ్యాపారం పెద్ద ఉపాధిగా ఎదుగుతోంది.

## ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమం విజయవంతం

**పాల్వంచ విశాలభారతి:**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖేలో ఇండియా సంవాద్ మై భారత్ నేషనల్ స్పోర్ట్స్ డే 2026 కార్యక్రమంలో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆన్లైన్ కార్యక్రమంలో ప్రసంగించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ అధ్యక్షత వహించారు మరియు ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీ ఎం పరంధామ రెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ డాక్టర్ వేముల కామేశ్వరరావు, కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇంచార్జ్ పొట్లపూవు శ్రీనివాసరావు, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ శ్రీదేవి, ప్రోగ్రాం ఇంచార్జ్ సీనియర్ కంప్యూటర్ లెక్చరర్ శ్రీమతి శ్యామల విమల మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ టి అరుణకుమారి, దేవసాని రమేష్, పారెల్లి శ్రీనివాస్, డాక్టర్ నియాజ్ పర్వీన్, డాక్టర్ శెట్టి స్వరూపా రాణి, కళాశాల టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది మరియు కళాశాల విద్యార్థిని విద్యార్థులు భారీ సంఖ్యలో మోదీతో ఆన్లైన్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి శ్రీ ఎం పరంధామ రెడ్డి మరియు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ ఆర్చరీ మరియు పంజాబ్ ఆర్చరీ విభాగం పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థి వి వంశీ, అండర్ 10 ఆర్చరీ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన ఎమ్ విక్రాంత్, పాల్వంచకు చెందిన ఖేలో ఇండియా ఆర్చరీ కోచ్ టి.కళ్యాణ్ లను ప్రిన్సిపాల్ మరియు స్టాఫ్ శాలువాతో సన్మానం చేయడం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారతదేశం రాబోయే రోజుల్లో ఒలింపిక్స్ లో అత్యధిక పథకాలను సాధించే విధంగా నేటి యువత కృషి చేయవలసి ఉన్నదని పేర్కొన్నారు మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిస్టిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీ ఎం పరంధామ రెడ్డి ప్రసంగిస్తూ భద్రాద్రి కొత్తగూడెంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు స్కూల్స్ మరియు కళాశాలలకు మా జిల్లా అధికారుల తరపున కలెక్టర్ గారి తరపున మా తరపున అత్యుత్తమ స్పోర్ట్స్ మెటీరియల్ను అందిస్తున్నామని జిల్లాలో క్రీడాకారులకు అతి విశాలమైన ఆటస్థలాలు కూడా ఉన్నాయని అంతేకాకుండా వివిధ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కు సంబంధించి కోచిలు కూడా అందుబాటులో ఉన్నారని కాబట్టి కళాశాల విద్యార్థులు మరియు స్కూల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో అత్యుత్తమ ఫలితాలను సాధించాలని మరియు రాష్ట్రస్థాయికి జాతీయ స్థాయికి అందరు గుర్తించే విధంగా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లో నేటి యువత ఎదగాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో నషా ముక్త్ యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కు సంబంధించి ప్రతిజ్ఞను భద్రాద్రి జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ వేముల కామేశ్వరరావు కళాశా స్టాఫ్ మరియు విద్యార్థులచే చేయించడం జరిగింది. ఈ కార్యక్రమం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్లు మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మోడీ ఆన్లైన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ప్రిన్సిపాల్ మరియు కళాశాల స్టాప్ సంతోషం వ్యక్తం చేశారు.

## 288 మంది భారతీయులు గల్లంతు!

**విశాలభారతి, జాతీయం:**

నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ జలప్రళయంలో 288 మంది భారతీయులు గల్లంతైనట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇప్పటివరకు 21 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఢిల్లీలో వివరాలు వెల్లడించారు. గల్లంతైన వారిలో తమిళనాడుకు చెందిన 86 మంది ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 32 మంది, కేరళకు చెందిన 33 మంది ఉన్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 61 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. త్రిశూలి విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది భారతీయులు కూడా గల్లంతయ్యారు. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన 21 మందిని రక్షించారు. వారి పరిస్థితి ప్రస్తుతం సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. భారత ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. స్థానిక అధికారులతో సమన్వయం పెంచింది. గల్లంతైన వారి వివరాల సేకరణ జరుగుతోంది. బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అత్యవసర సహాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నేపాల్‌లో పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. నేపాల్‌తో పాటు చైనా వైపున కూడా వరద ప్రభావం తీవ్రంగా కనిపించింది. అక్కడ సుమారు 150 మంది భారతీయ పౌరులు గల్లంతైనట్లు విదేశాంగ శాఖ తెలిపింది. మరో 200 మంది సురక్షితంగా ఉన్నప్పటికీ సహాయం కోసం విజ్ఞప్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. దార్చెన్‌లో 95 మంది, జిలాంగ్‌లో నలుగురు, జుతుల్‌పుక్‌లో 30 మంది ఉన్నట్లు సమాచారం. సాగా ప్రాంతంలో 60 నుంచి 70 మంది భారతీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు భారత దౌత్య బృందం స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. న్యూఢిల్లీలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. భారత రాయబార కార్యాలయాలు హాట్‌లైన్



సేవలు ప్రారంభించాయి. రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు. ఖాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం అత్యవసర నంబర్లు కూడా విడుదల చేసింది. సహాయం కోరే భారతీయులు అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరారు. అపోహలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గల్లంతైనవారి స్థానాన్ని గుర్తించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దౌత్య మార్గాల్లో రక్షణ చర్యలు వేగవంతమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో సమాచారం సేకరణకు సమయం పడుతోంది. అయినా భారత అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రతి సమాచారం కుటుంబాలకు చేరేలా చర్యలు చేపడుతున్నారు. నేపాల్‌టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన జలప్రళయం భారీ విధ్వంసానికి కారణమైంది. వరదలతో ఇప్పటివరకు 270 మంది మరణించినట్లు సమాచారం. వేలాది మంది ఆచూకీ గల్లంతైంది. ఇళ్లు, వాహనాలు, దుకాణాలు, రహదారులు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ విపత్తుకు ఎగువ ప్రాంతంలోని హిమనీ సరస్సు బద్దలవడం కారణమని అమెరికా భూగర్భ సర్వే ప్రాథమికంగా గుర్తించింది. తొలుత 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు సమాచారం వచ్చినా, ఉపగ్రహ చిత్రాల పరిశీలన తరువాత అక్కడ భూకంపం జరగలేదని స్పష్టం చేసింది. మంచు చరియలు, రాళ్లు, మట్టితో కూడిన భారీ ప్రవాహం ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చినట్లు వెల్లడైంది. లెండేకోలాలోకి ఈ ప్రవాహం చేరడంతో భోటే కోషి నది ఉప్పొంగింది. అనంతరం త్రిశూలి నదిలోకి నీరు వేగంగా చేరింది. గల్చి ప్రాంతంలో కేవలం 30 నిమిషాల్లో నీటిమట్టం 9 మీటర్లు పెరిగింది. ఈ ఆకస్మిక ఉప్పెన స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. అనేక గ్రామాలు నీటిలో చిక్కుకున్నాయి. సహాయక బృందాలు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నాయి. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ముప్పు పూర్తిగా తొలగిపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్‌చైనా సరిహద్దు ప్రాంతంలోని నదిలో ఎగువ వైపు నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న బ్లాకేజీ ఉన్నట్లు సమాచారం. అది ఒక్కసారిగా కదిలితే మరో భారీ వరద వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇదే సమయంలో భారత్ నేపాల్‌కు అత్యవసర సహాయాన్ని అందిస్తోంది. భారత వాయుసేనకు చెందిన సీ130జే రవాణా విమానం ద్వారా 10 టన్నుల సహాయక సామగ్రిని ఖాఠ్మాండూకు తరలించింది. టెంట్లు, దుప్పట్లు, హైజీన్ కిట్లు, సోలార్ లాంతర్లు, మందులు ఇందులో ఉన్నాయి. వైద్య బృందాలను కూడా పంపించారు. మరోవైపు ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ పట్టణంలో గల్లంతైనట్లు సద్గురు జగ్గీ వాసుదేవ్ తెలిపారు. మానసరోవర్ యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇమిగ్రేషన్ కార్యాలయం వద్ద ఉండగా వరదలు సంభవించడంతో భవనం పూర్తిగా ధ్వంసమైనట్లు చెప్పారు. గల్లంతైన బృందంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకే, జర్మనీ, ఫ్రాన్స్‌కు చెందిన యాత్రికులు ఉన్నారు.

## పాలకుర్తి కాంగ్రెస్‌లో కుతకుత..!

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయ వ్యూహకర్తగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి నేతను ఓడించడం కాంగ్రెస్ శ్రేణులకు గొప్ప విజయంగా నిలిచింది. యశస్విని రెడ్డి అభ్యర్థిత్వానికి అత్త ఝాన్సీ రెడ్డి బలమైన రాజకీయ వ్యూహంతో మద్దతు ఇచ్చారు. నియోజకవర్గంలోని వివిధ సామాజిక వర్గాలను కలుపుకొని ప్రచారం సాగించడంతో కాంగ్రెస్ బలం పెరిగింది. క్షేత్రస్థాయిలో గులాబీ పార్టీకి ఉన్న పాత బలాన్ని అధిగమించి కాంగ్రెస్ జెండా ఎగరడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే ఆ విజయాన్ని కొనసాగించేలా సమన్వయం కనిపించకపోవడం ఇప్పుడు పార్టీకి ప్రధాన సమస్యగా మారింది. ఈ విజయంతో నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు కొత్త రాజకీయ ఆశలు పుట్టాయి. పార్టీ శ్రేణుల్లో అంచనాలు పెరిగాయి. యశస్విని రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత పాలకుర్తిలో కాంగ్రెస్ అంతర్గత విభేదాలు మెల్లగా బయటపడినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఝాన్సీ రెడ్డి నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటున్నాయన్న ఆరోపణలు కొందరు స్థానిక నేతల నుంచి వినిపించాయి. దీంతో ఆమెకు వ్యతిరేకంగా మరో వర్గం క్రమంగా బలపడింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఈ విభేదాలకు పరీక్షగా మారాయి. ఝాన్సీ రెడ్డి మద్దతు ఇచ్చిన అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అసంతృప్తి వర్గం నిలబడింది. కొన్ని చోట్ల ఆ వర్గానికి గులాబీ పార్టీ సానుభూతిపరుల మద్దతు కూడా లభించినట్లు సమాచారం. ఫలితంగా పాలకుర్తిలో అనేక గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ అధికారిక వర్గానికి ఎదురుదెబ్బలు తగిలాయి. ఈ పరిణామాలు చివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. పార్టీ అధిష్ఠానం వరకు ఫిర్యాదులు చేరినా స్థానిక స్థాయిలో విభేదాలు పూర్తిగా తగ్గలేదు. కార్యకర్తలు మాత్రం ఎవరి వెంట నడవాలో స్పష్టత లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి పార్టీ సంస్థాగత బలంపై ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో యశస్విని రెడ్డి వర్గానికి కాకిరాల హరి ప్రసాద్ వర్గానికి మధ్య విభేదాలు మరింత బహిర్గతమవుతున్నాయి. ఇటీవల తొర్రూరు మండలంలోని సోమవారం గ్రామంలో శివాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా వర్గపోరు స్పష్టంగా కనిపించింది. ఒక వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చిత్రం కనిపించలేదు.





మరో వర్గం ఫ్లెక్సీలో యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి చిత్రాలను ప్రముఖంగా ఉంచింది. హరి ప్రసాద్ వర్గం ఫ్లెక్సీలలో వేం నరేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిత్రాలు మాత్రమే కనిపించడం చర్చకు దారితీసింది. చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే, ఆమె అత్త చిత్రాలు ఉండటం వర్గాల మధ్య దూరాన్ని బయటపెట్టింది. చిన్న కార్యక్రమంలోనూ ఇలాంటి విభేదాలు కనిపించడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన పెంచుతోంది. నాయకుల మధ్య సమన్వయం లేకపోతే క్షేత్రస్థాయి కార్యకర్తల్లో నిరుత్సాహం పెరుగుతుందని స్థానిక నేతలు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు ముందే ఈ సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు కోరుతున్నారు. మరోవైపు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడిని కొనసాగిస్తున్నారు. తన హయాంలో కాల్వలకు సమృద్ధిగా నీరు వచ్చేదని, రైతులు మూడు పంటలు సాగు చేసేవారని ఆయన తరచూ చెబుతున్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు మందగించాయని ఆరోపిస్తూ నిరసన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. నియోజకవర్గాన్ని పూర్తిగా అంటిపెట్టుకొని ఉండటం ఆయనకు రాజకీయంగా కలిసొస్తోందన్న అభిప్రాయం ఉంది. ఇటీవల మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ పార్టీని దాదాపు పీఠం దక్కే స్థాయికి తీసుకెళ్లడం ఆయన స్థానిక ప్రభావానికి ఉదాహరణగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. చివరి దశలో పరిణామాలు మారడంతో ఆ పార్టీకి నిరాశ ఎదురైంది. అయినప్పటికీ దయాకర్ రావు దూకుడు తగ్గలేదు. కాంగ్రెస్‌లో అంతర్గత పోరు కొనసాగుతున్న సమయంలో ఆయన నిరంతర పర్యటనలు, నిరసనలు పార్టీకి సవాల్‌గా మారుతున్నాయి. పాలకుర్తిలో ప్రభుత్వంపై అసంతృప్తిని రాజకీయంగా మలచేందుకు బీఆర్ఎస్ క్రమంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో దయాకర్ రావు పాత్ర కీలకంగా కనిపిస్తోంది. దీంతో కాంగ్రెస్ స్థానిక నాయకత్వం అప్రమత్తమవుతోంది. ఇది బీఆర్ఎస్‌కు కొత్త అవకాశంగా మారుతోంది. మొత్తంగా చూస్తే 2023లో పాలకుర్తిలో కాంగ్రెస్ సాధించిన చారిత్రక విజయానికి ప్రస్తుతం అంతటి రాజకీయ ఊపు కనిపించడం లేదన్న భావన బలపడుతోంది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గెలుపు తరువాత పార్టీని ఏకతాటిపై నడిపించాల్సిన అవసరం పెరిగింది. ఝాన్సీ రెడ్డి చుట్టూ ఏర్పడిన అసంతృప్తి, హరి ప్రసాద్ వర్గంతో విభేదాలు, స్థానిక ఎన్నికల్లో ఎదురైన ఫలితాలు కాంగ్రెస్‌కు హెచ్చరికలుగా మారాయి. మరోవైపు ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజకవర్గంలో నిరంతరంగా ప్రజల్లో ఉండటం బీఆర్ఎస్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. గ్రామస్థాయిలో ఆ పార్టీ మళ్లీ బలం పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ నాయకత్వం ఇప్పుడు వెంటనే సమన్వయ సమావేశాలు నిర్వహించి వర్గాల మధ్య దూరాన్ని తగ్గించకపోతే పరిస్థితి మరింత క్లిష్టమయ్యే అవకాశం ఉంది. అభివృద్ధి పనులపై ప్రజల్లో విశ్వాసం పెంచడం, కార్యకర్తలకు స్పష్టమైన బాధ్యతలు ఇవ్వడం, నాయకుల మధ్య సమన్వయం సాధించడం కీలకం. వచ్చే ఎన్నికల వరకు ఈ పరిణామాలు కొనసాగితే పాలకుర్తి పోరు హోరాహోరీగా మారే అవకాశముంది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు గెలుపు కంటే గెలుపును కాపాడుకోవడమే సవాలుగా కనిపిస్తోంది.

## అవినీతిలో అనకొండ..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొజ్జ జయరాజుపై అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం భారీ సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే సమాచారంతో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి తనిఖీలు కొనసాగాయి. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో జయరాజు నివాసాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లను అధికారులు పరిశీలించారు. రూ.3 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. అయితే వాటి మార్కెట్ విలువ సుమారు రూ.70 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జయరాజు, డిప్యూటీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కూడా చూస్తున్నారు. ఈ సమయంలో ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆధారాలు సేకరించేందుకు ఏసీబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సోదాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్, కేపీహెచ్‌బీ కాలనీల్లో జయరాజుకు విలాసవంతమైన భవనాలు ఉన్నట్లు సోదాల్లో గుర్తించారు. కీసర, తుంగతుర్తి, తూప్రాన్, సూర్యాపేట ప్రాంతాల్లో ఐదు ప్లాట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీటితో పాటు మూడున్నర ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను గుర్తించారు. జయరాజు కుటుంబ ఆస్తుల వివరాలను సైతం అధికారులు పరిశీలించారు. రెండు కార్ల విలువ సుమారు రూ.40 లక్షలుగా నిర్ధారించారు. మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.7 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. పోస్టాఫీస్ సేవింగ్స్ పథకంలో రూ.20.86 లక్షలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. బంగారు ఆభరణాల విలువ రూ.37 లక్షలుగా లెక్కించారు. గుర్తించిన ఆస్తుల విలువ రూ.3 కోట్లకు చేరినట్లు ఏసీబీ పేర్కొంది. మార్కెట్ ధరల ప్రకారం మొత్తం విలువ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆస్తుల కొనుగోలు ఆదాయ వనరులపై విచారణ సాగుతోంది. పత్రాల పరిశీలన పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. సోదాల సమయంలో జయరాజు వ్యక్తిగత డ్రైవర్ సత్తునూరి యాదయ్య ఫోన్‌ను ఏసీబీ అధికారులు పరిశీలించారు. అందులోని బ్యాంకు లావాదేవీలను పరిశీలించగా కీలక సమాచారం బయటపడినట్లు అధికారులు తెలిపారు. యాదయ్య ఖాతా నుంచి జయరాజు కుమార్తె ఖాతాకు రూ.24.80 లక్షలు బదిలీ అయినట్లు గుర్తించారు. ఈ నగదు బదిలీ వెనుక కారణాలపై అధికారులు ఆరా తీశారు. విచారణలో అక్రమ ఇసుక రవాణాకు సంబంధించిన డబ్బులు డ్రైవర్ ఖాతాలోకి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. పలువురు వ్యక్తుల నుంచి జయరాజు వసూలు చేసిన మొత్తాలను యాదయ్య ఖాతాకు బదిలీ చేయించినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. అనంతరం డ్రైవర్ ఖాతా నుంచి ఆ నగదును జయరాజు కుమార్తె ఖాతాకు పంపినట్లు అధికారులు గుర్తించారు. ఈ లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్లు, ఫోన్ సమాచారం, ఆధారాలను అధికారులు సేకరిస్తున్నారు. నగదు ప్రవాహానికి సంబంధించిన పూర్తి వివరాలను నిర్ధారించేందుకు మరిన్ని ఖాతాలను పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద లావాదేవీలపై సంబంధిత అని ఏసీబీ అధికారులు తెలిపారు. గనుల శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారిపై ఏసీబీ దాడులు జరగడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయరాజు డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలను అదనంగా నిర్వర్తిస్తున్న సమయంలో ఈ సోదాలు జరిగాయి. గనులు, ఇసుక రవాణా వ్యవహారాల్లో అధికారుల నిర్ణయాలకు ప్రాధాన్యం ఉండటంతో వచ్చిన ఆరోపణలను ఏసీబీ అధికారులు తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తుల అంశంతో పాటు అనుమానాస్పద నగదు లావాదేవీలపై దర్యాప్తు సాగుతోంది. గుర్తించిన భవనాలు, భూములు, ప్లాట్లు, వాహనాలు, బంగారు ఆభరణాలకు సంబంధించిన కొనుగోలు వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఆస్తుల అసలు విలువ, వాటి కొనుగోలు సమయంలో చెల్లించిన మొత్తాలు, నిధుల మూలాలను పరిశీలిస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లోని లావాదేవీలను కూడా సరిపోల్చుతున్నారు. డ్రైవర్ ఖాతా నుంచి జరిగిన బదిలీలు ఈ కేసులో కీలక ఆధారాలుగా మారే అవకాశముంది. సోదాల సందర్భంగా లభించిన పత్రాలు, డిజిటల్ సమాచారం అని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ఉదయం ప్రారంభమైన ఏసీబీ తనిఖీలు సాయంత్రం వరకు కొనసాగినట్లు సమాచారం. హైదరాబాద్ సహా ఎనిమిది ప్రాంతాల్లో ఒకేసారి చేపట్టిన సోదాలతో జయరాజుకు సంబంధించిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు సమగ్రంగా దృష్టి పెట్టారు. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల్లో భవనాలు, ప్లాట్లు, వ్యవసాయ భూమి, కార్లు, బ్యాంకు నగదు, పోస్టాఫీస్ పెట్టుబడులు, బంగారు ఆభరణాలు ఉన్నాయి. వీటి విలువ పత్రాల ప్రకారం సుమారు రూ.3 కోట్లుగా ఉండగా, మార్కెట్ విలువ రూ.70 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వ్యక్తమవుతోంది. డ్రైవర్ యాదయ్య ఖాతా ద్వారా కుమార్తె ఖాతాకు జరిగిన రూ.24.80 లక్షల బదిలీపై ప్రత్యేకంగా విచారణ కొనసాగుతోంది. అక్రమ ఇసుక రవాణా, వసూళ్ల ఆరోపణలతో ఈ లావాదేవీలకు సంబంధం ఉందా అనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. సోదాల్లో లభించిన పత్రాలను విశ్లేషించిన తర్వాత ఆస్తుల సంఖ్య, విలువపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడించబోమని అని ఏసీబీ అధికారులు స్పష్టంగా తెలిపారు.





# అకాడమీ అభివృద్ధిలో మరో ముందడుగు

**గోల్ఫ్ కార్ట్, ఆధునీకరించిన ఫోటోగ్రఫీ స్టూడియో, కాపీ–ప్రింట్ లాంజ్ ప్రారంభం**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీని జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఎగ్జిక్యూటివ్ ట్రైనింగ్ సంస్థగా తీర్చిదిద్దే దిశగా మరో ముందడుగు పడింది. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ ప్రత్యేక చొరవతో పలు నూతన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా 14 సీట్ల సామర్థ్యం కలిగిన ఎలక్ట్రిక్ గోల్ఫ్ కార్ట్, ఆధునీకరించిన ఫోటోగ్రఫీ స్టూడియో, కాపీ-ప్రింట్ లాంజ్‌లను గురువారం ప్రారంభించారు. అకాడమీని సందర్శించే అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి వీఐపీలు, వీవీఐపీలకు ప్రాంగణంలోని వివిధ ప్రాంతాలను సౌకర్యవంతంగా సందర్శించేలా పర్యావరణహితమైన 14 సీట్ల ఎలక్ట్రిక్ గోల్ఫ్ కార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాహనాన్ని డైరెక్టర్ అభిలాష బిస్త్ ప్రారంభించడంతో పాటు స్వయంగా నడిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి ఏకశిల భవనం నుంచి రాణి రుద్రమదేవి ఆడిటోరియం వరకు గోల్ఫ్ కార్ట్‌లో ప్రయాణించారు. అనంతరం వాహనాన్ని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి అప్పగించారు. ఆధునిక సాంకేతికతతో ఫోటోగ్రఫీ స్టూడియో అకాడమీ ఫోటోగ్రఫీ విభాగాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత అభివృద్ధి చేశారు. నూతన కెమెరాలు, ఆర్6 మార్క్-3, డీజేఐ ఎయిర్-3ఎస్ డ్రోన్‌తో పాటు ఇతర ఆధునిక పరికరాలను సమకూర్చారు. ఆధునీకరించిన ఫోటోగ్రఫీ స్టూడియోను డైరెక్టర్ అభిలాష బిస్త్ ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన పరికరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన కెమెరాతో డీఎస్పీల ఫొటోలను స్వయంగా తీసిన ఆమె, అనంతరం డ్రోన్‌ను కూడా ఆపరేట్ చేసి దాని పనితీరును పరిశీలించారు. ఆధునిక పరికరాలను ఫోటోగ్రఫీ విభాగానికి అందజేశారు. వీటి ద్వారా అకాడమీలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు, అధికారిక కార్యక్రమాలు, ఇతర ముఖ్యమైన ఈవెంట్లను మరింత నాణ్యతతో చిత్రీకరించేందుకు అవకాశం ఏర్పడింది.

**వేగవంతమైన సేవలకు కాపీ–ప్రింట్ లాంజ్**

అకాడమీ పరిపాలనా, శిక్షణా అవసరాలకు అనుగుణంగా కాపీ-ప్రింట్ లాంజ్‌ను కూడా ఆధునీకరించారు. ఇందులో నూతన హైస్పీడ్ కోనికా మినోల్టా-65 జిరాక్స్, ప్రింటింగ్ మెషీన్లను ఏర్పాటు చేసి ప్రారంభించారు. దీంతో శిక్షణా సామగ్రి, అధికారిక పత్రాలు, పరిపాలనా అవసరాలకు సంబంధించిన కాపీయింగ్, ప్రింటింగ్ పనులను వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేసే అవకాశం కలిగింది.

**రెండు వారాల్లో మూడు అభివృద్ధి కార్యక్రమాలు**

అకాడమీ శిక్షణ, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకొని డైరెక్టర్ అభిలాష బిస్త్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో కేవలం రెండు వారాల వ్యవధిలోనే మూడు కీలక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం విశేషం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పర్యావరణహిత సదుపాయాల కల్పన, పరిపాలనా సేవల వేగవంతం ద్వారా పోలీస్ అకాడమీని మరింత ఉన్నత ప్రమాణాలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చేతన, ఐపీఎస్, మురళీధర్, ఐపీఎస్, వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, నరహరి, డీఎస్పీలు ఆదూరి శ్రీనివాసరావు, భాస్కర్, రామారావు, తోట శ్రీనివాస్, కృష్ణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, వివిధ విభాగాల రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అవుట్‌డోర్, ఇండోర్ ఫ్యాకల్టీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వాలి

- **రిటైర్డ్ జిహెచ్‌ఎం ఎంఈఓ పోచం బాబి మహేందర్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** విశ్రాంత ఉద్యోగులు ఉపాధ్యాయులు వారికి రావలసిన బెనిఫిట్స్ కోసం గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో కలెక్టరేట్ కార్యాలయంలో జరుగుతున్న ధర్నా కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ జిహెచ్‌ఎం పోచం బావి మహేందర్, జగన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం పక్షాన నేటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడం సరైనది కాదు. దురదృష్టకరం బాధాకరం గత 3 సంవత్సరముల నుండి ఉపాధ్యాయులు ఉద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూసి వారికి రావలసిన 6 డి ఏ లు ఒక పిఆర్సి, రిటైర్డ్ ఉద్యోగస్తులకు రావలసిన బెనిఫిట్స్ రాకపోవడం వల్ల తీవ్ర నిరాశతో ఉన్నారని అన్నారు. గతంలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నారా చంద్రబాబు నాయుడు వంటి వారు ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు వివిధ సంఘాల నాయకులతో సమావేశమై చర్చల ద్వారా శాంతియుతంగా వారి డీఏలు పిఆర్సీలు పెన్షన్స్ వంటి వాటిని ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం సమస్యలు పరిష్కరించే విధంగా నేడు ఉన్న సీఎం ఉపాధ్యాయుల పట్ల మొండి వైఖరి చూస్తున్నారని అన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్సర్లను అలాంటి చర్చలు జరపకుండా కాలయాపన చేస్తున్నారని ఉద్యోగస్తులు వారి కుటుంబాలను వృద్ధులను వికలాంగులను సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నానా కష్టాలకు గురి చేయడం, ఇప్పటికైనా వెంటనే స్పందించి ఆర్ డి ఏ లు పిఆర్సిలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాల విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధే లక్ష్యం: కొలన్ హన్మంత్ రెడ్డి

- **మహాదేవపురంలో రూ.1.20 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపన**



**కుత్బుల్లాపూర్, విశాలభారతి:** మహాదేవపురం డివిజన్ పరిధిలోని కైసర్‌నగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం శ్రీకారం చుట్టారు. సీఎంసీ ప్రత్యేక నిధుల కింద మంజూరైన రూ.1.20 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరచడంతోపాటు నాణ్యమైన రోడ్ల నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. కైసర్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంపై కాలనీ వాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, మహిళా వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, నాయకులు మన్నే రాజు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం బిజెపి రాజీలేని పోరాటం

- **ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్**



**ముషీరాబాద్, విశాల భారతి:** తెలంగాణ విద్యార్థులు న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజి లేని పోరాటం చేస్తుందని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. గురువారం ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీ నగర్ లో మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో ఠాకూర్ శక్తి సింగ్ అధ్యక్షతన బిజెపి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ కె లక్ష్మణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయొద్దని సూచించారు. చేతిలో రాజ్యాంగం పుస్తకం పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి కాంగ్రెస్ పాలిత తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు మద్దతు తెలుపుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావును హౌస్ అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రామ్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సాయిచంద్, రఘునాథ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. మూడు కార్లు ఢీ

- **అతివేగమే కారణమై ఉండొచ్చని పోలీసుల అనుమానం..**
- **నలుగురికి స్వల్ప గాయాలు**

**రాజేంద్రనగర్, విశాల భారతి:**



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కార్లు ఒకదానినొకటి ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న సమయంలో తెలంగాణ పోలీస్ అకాడమీ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా మూడు కార్లు ఢీకొనడంతో వాహనదారులు, స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. గచ్చిబౌలి వైపు నుంచి శంషాబాద్ దిశగా వెళ్తున్న మూడు కార్లు తెలంగాణ పోలీస్ అకాడమీ సమీపానికి చేరుకున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాయి. వేగంగా వెళ్తున్న వాహనాల్లో ఒకదానిపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం లేదా అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మూడు కార్లు వరుసగా ఢీకొనడంతో వాహనాలకు కొంతమేర నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో కార్లలో ప్రయాణిస్తున్న సుమారు నలుగురికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలించడంతో పాటు వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డుపై నిలిచిపోయిన ప్రమాదానికి గురైన మూడు కార్లను పోలీసులు పక్కకు తొలగించారు. అనంతరం రహదారిపై ఉన్న వాహనాలను క్లియర్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం వంటి కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## కారు ఇప్పిస్తానని నమ్మించి రూ.14లక్షలు కాజేసిన వ్యక్తి అరెస్ట్

- **ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంఘటన**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** విఐపి కోటలో కారు తక్కువ ధరకు ఇప్పిస్తానని నమ్మించి విడతల వారీగా ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి రూ. 14,77,150 లక్షల రూపాయలు కాజేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన గురువారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామానికి చెందిన మీగడ మురళి(40) సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో అర్చక వృత్తి లో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలం అలాజ్ పూర్ గ్రామానికి చెందిన తాటిపల్లి నవీన్ గౌడ్ తరచుగా రావిర్యాలలోని సూర్యాగిరి ఎల్లమ్మ దేవాలయానికి వస్తుంటాడు. ఈ క్రమంలో పూజారి మీగడ మురళి తో పరిచయం ఏర్పడింది. నిందితుడు తనకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో సన్నిహిత పరిచయాలు ఉన్నాయని, రాజకీయంగా తనకు పలుకుబడి ఉందని చెప్పి విఐపి కోటా ద్వారా తక్కువ ధరకు కొత్త కారు ఇప్పించగలనని ఫిర్యాదుదారుని నమ్మించి, విడతల వారీగా సుమారు రూ.11లక్షలు తీసుకున్నాడు. అదేవిధంగా ఇబ్రహీంపట్నంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి, ప్రాసెసింగ్ తదితర ఖర్చుల పేరుతో మరో రూ.3,77,150/ తీసుకున్నట్లు తెలిపారు. ఈ విధంగా మొత్తం రూ.14,77,150/ తీసుకున్నప్పటికీ కారు లేదా ఇల్లు ఇప్పించకుండా కాలయాపన చేసినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఈ విధంగా రాజకీయ పలుకుబడి, ఇతర ప్రభావాలను చూపించి డబ్బులు వసూలు చేసి, ఫిర్యాది గట్టిగా డబ్బు అడిగేసరికి అందరిముందు నన్ను డబ్బులు అడిగి నా పరువుకు భంగం కలిగించినావు అని నీ మీద పరువు నష్టం కింద రూ. 50 లక్షల కు ధావా వేస్తాను అని బెదిరించినాడు అని ఫిర్యాదు ఇవ్వగా అట్టి ఫిర్యాదు ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్.671/2026 U/s 316(2), 318(4) బి.ఎన్.ఎస కింద కేసు నమోదు చేసి నిందితుడు తాటిపల్లి నవీన్ గౌడ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించారు. నేరస్థుడు గతంలో అబ్దుల్లాపూర్ మెట్, ఎల్‌బి నగర్, మహబూబ్ నగర్ లలోపలు కేసులలో నిందితుడు అని మొత్తం (04) చీటింగ్ కేసులు నమోదు అయినట్లు తెలిపినారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, కార్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేదా ఇతర ప్రయోజనాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే, ఎటువంటి మొత్తాన్ని చెల్లించకుండా సంబంధిత ప్రభుత్వ అధికారులను లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు

## ఓటర్ల జాబితాపై గ్రామసభ

- **చిన్నరావిరాలలో ఎస్ఐఆర్‌పై అవగాహన**
- **జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని సూచన**
- **గ్రామస్థులకు వివరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**



ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా చిన్న రావిరాల గ్రామపంచాయతీ ఆవరణలో ఓటర్ల జాబితాపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గ్రామానికి చెందిన ప్రతి ఒక్కరూ తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు నమోదు కాకపోతే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుని పేరు నమోదు చేసుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు లేదా వ్యత్యాసాలు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా జాబితాలో వివరాలను ముందుగానే పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని గ్రామసభలో వివరించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై గ్రామస్థులకు పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## నందివనపర్తి లో ఓటర్ల జాబితాపై గ్రామసభ

- **ఎస్ఐఆర్‌పై అవగాహన.. జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని సూచన**
- **డిప్యూటీ తహసిల్దార్ కీర్తి సాగర్ సర్పంచ్ రాయకంటి విజయ్ కుమార్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నందివనపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఓటర్ల జాబితాపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయి కంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన యాచారం డిప్యూటీ తహసిల్దార్ కీర్తి సాగర్ మాట్లాడుతూఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గ్రామానికి చెందిన ప్రతి ఒక్కరూ తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు నమోదు కాకపోతే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుని పేరు నమోదు చేసుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు లేదా వ్యత్యాసాలు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా జాబితాలో వివరాలను ముందుగానే పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని గ్రామసభలో వివరించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ రాయి కంటి విజయకుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై గ్రామస్థులకు పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జనిగే శ్రీశైలం వార్డు సభ్యులు, నిట్టి బీరప్ప, యంజాల విజేత, హరి నాయక్, రమేష్, అంగన్వాడి టీచర్లు డ్వాక్రా మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే పేదరికంపై విజయం

- **నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ**
- **క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** నేటి పోటీ ప్రపంచంలో విద్యను మించిన సంపద మరొకటి లేదని ప్రముఖ సినీ నిర్మాత, సామాజికవేత్త, లయన్ బి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యతోనే పేదరికాన్ని జయించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నాగోల్ సాయినగర్ గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద విద్యార్థులకు ప్రముఖ సామాజికవేత్త లయన్ కవిత హీరానందాని, ప్రముఖ సినీ రచయిత బి. వెంకటరమణతో కలిసి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదరికం చదువుకు ఎప్పటికీ అడ్డంకి కాదని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్య విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమని, చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడా రంగంలోనూ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. నేటి యువత విద్య ద్వారా స్వశక్తిని పెంపొందించుకోవడంతో పాటు దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు భవిష్యత్తులోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భారీగా గుట్కా సరఫరా చేస్తున్న నిందితుడి అరెస్ట్

- **రూ.7.5 లక్షల విలువైన గుట్కా, డీసీఎం వాహనం స్వాధీనం**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** మైలార్‌దేవ్‌పల్లి లో ప్రభుత్వం నిషేధించిన గుట్కాను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.7.5 లక్షల విలువైన గుట్కాతో పాటు ఐషర్ డీసీఎం వాహనం, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 26వ తేదీ రాత్రి మైలార్‌దేవ్‌పల్లిలోని జీఎంఆర్ పార్కింగ్ ప్రాంతంలో గుట్కా లోడ్‌తో ఓ డీసీఎం వాహనం ఉన్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని MH10DT4563 నంబర్ గల ఐషర్ డీసీఎం వాహనాన్ని తనిఖీ చేశారు. తనిఖీల్లో వాహనంలో ఒక్కొక్కటి 50 కిలోల బరువున్న మొత్తం 50 గుట్కా బస్తాలు గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.7.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గుట్కాతో పాటు డీసీఎం వాహనం, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన నిందితుడిని మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా ఎరాండోలి ప్రాంతానికి చెందిన అన్వర్ మన్సూర్ సయ్యద్ (40)గా పోలీసులు గుర్తించారు. ఇతను వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 724/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 280, కోట్పా చట్టంలోని సెక్షన్ 20(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిషేధిత గుట్కా అక్రమ రవాణా, సరఫరాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఐపీఎస్, చంద్రాయణగుట్ట ఏసీపీ ఎ. సుధాకర్ పర్యవేక్షణలో మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ చ. శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

## రాఖీతో ఆత్మీయత

- **అబ్దుల్లాపూర్‌మెట్‌లో రక్షాబంధన్ కార్యక్రమం**
- **సహచరి యోగక్షేమాలు తెలుసుకున్న ఏసీపీ కాశిరెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** మల్కాజ్‌గిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వనస్థలిపురం ఏసీపీ పి. కాశిరెడ్డి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సహచరి జి. మహేశ్వరి నివాసానికి వెళ్లి ఆమె యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొని ఆత్మీయతను చాటుకున్నారు. సాయి నికేతన్ పాఠశాల సమీపంలో నివసించే జి. మహేశ్వరిని ఏసీపీ పి. కాశిరెడ్డి కలుసుకుని కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్షాబంధన్ సందర్భంగా రాఖీ కార్యక్రమంలో పాల్గొని సోదరభావాన్ని చాటుకున్నారు. పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది కుటుంబాలతో అధికారులు ఆత్మీయంగా మెలగడం, వారి యోగక్షేమాలను తెలుసుకోవడం ద్వారా పరస్పర అనుబంధం మరింత బలపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, అడ్మిన్ సబ్ ఇన్స్పెక్టర్ మాధవరావు, అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జినక మల్లమ్మ మృతికి నివాళి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న**

**మరిపెడ విశాల భారతి:** మరిపెడ మండలం అబ్బాయి పాలెం గ్రామంలోని భవన నిర్మాణ కార్మికులు జినక చంద్రయ్య, పరశురాములు, జంపయ్య, మైసయ్య, తల్లి జినక మల్లమ్మ (76) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు మండల నాయకులు గుండగాని మధుసూదన్ , వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ సంఘాలు సంతాపం తెలియజేస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న, కెవిపిఎస్ జిల్లా నాయకులు జిన్నా లచ్చన్న, మాజీ ఎంపీటీసీ జినక వీరయ్య, జె రాములు, సిఐటియు గ్రామ నాయకులుజినక సైదులు, కృష్ణ మూర్తి, మేస్త్రి వెంకయ్య, బాలకృష్ణ, ఎర్ర వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై దృష్టి

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఎస్ఐఆర్ గ్రామసభ
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్ధారించుకోవాలి
- సెప్టెంబర్ 16లోపు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ

**విశాల భారతి, ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్ మెట్**




ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఎస్ఐఆర్ గ్రామసభలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి పాల్గొని ఓటర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ప్రతి ఓటరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా తప్పిపోకుండా చూడటమే లక్ష్యమని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏ కారణం చేతనైనా పేరు నమోదు కాని అర్హత కలిగిన భారతీయ పౌరులు తమ పేరును నమోదు చేసుకునేందుకు ఫారం6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన పత్రాలను సమర్పించాలని వివరించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తిచేసుకునే అర్హులైన యువత కూడా ఓటర్ల జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.

**తప్పులు ఉంటే సరిచేసుకునే అవకాశం**

ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు ఉన్నప్పటికీ వ్యక్తిగత వివరాల్లో పొరపాట్లు, తప్పులు లేదా వ్యత్యాసాలు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అవసరమైన పత్రాలను దరఖాస్తుతో జతచేసి సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. అదేవిధంగా ముసాయిదా జాబితాలో పేరు ఉన్నప్పటికీ ఓటరుగా నమోదుకు అనర్హుడైన వ్యక్తి పేరు ఉన్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఓటరు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని వివరించారు. ఇందుకోసం ఫారం7తో పాటు డిక్లరేషన్ ఫారాన్ని సమర్పించాలని సూచించారు. అభ్యంతరం తెలిపే వ్యక్తి తప్పనిసరిగా సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలని స్పష్టం చేశారు.

**గడువు లోపు దరఖాస్తులు**

ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. అర్హత కలిగిన వారు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్దేశిత ఫారాలైన ఫారం6, ఫారం7 లేదా ఫారం8 ద్వారా ఈసీఐ నిర్దేశించిన సెప్టెంబర్ 16, 2026లోపు సమర్పించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**నోటీసులు అందుకున్నవారు పత్రాలతో హాజరు కావాలి**

ఎన్నికల అధికారుల నుంచి నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి వద్ద విచారణకు హాజరు కావాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల పత్రాల్లో తమ వద్ద అందుబాటులో ఉన్న సంబంధిత పత్రాలను తీసుకువచ్చి అధికారులకు సమర్పించాలని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియ కూడా నిబంధనల ప్రకారం కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు అధికారులకు సహకరించి ముసాయిదా జాబితాను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు, అభ్యంతరాలను గడువులోగా సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్మెట్ మండల ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీ ఓ మహమ్మద్ షఫీ ఉల్లా ఖాన్, అబ్దుల్లాపూర్మెట్ సెక్రటరీ తుల్జా ప్రసాద్ తోపాటు వివిధ గ్రామాల సెక్రటరీలు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూములు కాపాడాలి

- సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి
- దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని భక్తుల డిమాండ్




**కుత్బుల్లాపూర్ విశాల భారతి:** జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 14 ఎకరాల 10 గుంటల భూములను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ భక్తులు, అఖిలపక్షాల ఆధ్వర్యంలో గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆలయ భూములకు తక్షణమే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏసురత్నం దీక్షను ప్రారంభించగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జనసేన అధికార ప్రతినిధి సతీష్, బీజేపీ నాయకులు మాధవులు, టీజేఎస్ నాయకులు ఎర్రవీరన్న, కార్మిక నాయకుడు దుర్గయ్య తదితరులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ భూములను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం 12 వారాల్లోగా ఆలయ భూములను సర్వే చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నెల రోజులుగా ఎమ్మార్వో, కలెక్టర్‌కు పలుమార్లు వినతులు సమర్పించినా స్పందన లేకపోవడం విచారకరమన్నారు. వారం రోజుల్లోగా సర్వే చేపట్టి భూములకు హద్దులు నిర్ణయించకపోతే తదుపరి న్యాయపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆలయ ఆస్తులను పరిరక్షించడం అధికారులు, పాలకుల బాధ్యత అని, భక్తుల మనోభావాలను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, జనసేన, బీజేపీ, టీజేఎస్ నాయకులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 22A బాధిత రైతుల సమస్య పరిష్కారానికి మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి కృషి

- హరీష్ రావు ని కలిసిన ప్రశాంత్ రెడ్డి, బాధిత రైతులు
- 22-Aతో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే 2 రోజుల్లో ప్రభుత్వంపై పోరాటం చేస్తాం
- హరీష్ రావు, మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాలు (రాందాస్ పల్లి, శేరిగూడ, కోహెడ, పటేల్ గూడ తదితర గ్రామాల) ప్రజలు సెక్షన్ 22A కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పాటు, రైతులకు రైతుబంధు, రైతుబీమా వంటి ప్రభుత్వ పథకాలు అందకపోవడం, బ్యాంకు రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)దృష్టికి తీసుకెళ్లగా బాధితులతో కలిసి వారి సమస్యలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లి, తక్షణ పరిష్కారం కోసం విన్నవించారు. ఈ సమస్యపై స్పందించిన హరీష్ రావు , ప్రైవేట్ రైతుల భూములను 22A పరిధిలోకి తీసుకురావడం వల్ల ఏర్పడుతున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అర్హత ఉన్న భూములపై 22A ఆంక్షలను తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు, భూ యజమానుల సమస్యలను పరిష్కరించకపోతే, త్వరలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి వచ్చి రైతుల తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హరీష్ రావు తెలిపారు.

## 22A పై మండల రైతులు ఆందోళన చెందవద్దు

- ఇబ్రహీంపట్నం తహసిల్దార్ సునీత రెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** 22A పై మండల రైతులు ఎవరు ఆందోళన చెందొద్దని ఇబ్రహీంపట్నం తహసిల్దార్ సునీత రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సునీతా రెడ్డి మాట్లాడుతూ 22A / నిషేధిత ఆస్తుల (POB) జాబితాలో చేర్చబడిన భూములను సమగ్రంగా పరిశీలన జరుగుతుందని, ప్రభుత్వం అవసరం లేని లేదా ప్రభుత్వానికి ఆసక్తి లేని పట్టా భూములకు సంబంధించి, వర్తించే నిబంధనలు విధానాల ప్రకారం POB జాబితా నుండి తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని,ప్రభుత్వం అవసరం లేని పట్టా భూములకు సంబంధించి ప్రజల నుండి వచ్చే నిజమైన అభ్యర్థనలను పరిశీలిస్తామని, నిబంధనల ప్రకారం అనుమతించబడిన వాటిని POB జాబితా నుండి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు తెలియజేశారు. ఇబ్రహీంపట్నం మండల పరిదిలో ఉన్న రైతులకు 22ఏ పైన ఎలాంటి సందేహాలు ఉన్న గ్రామ స్థాయి లో (GPO) లు తహశీల్దార్ కార్యాలయంలో అదికారులు అందరూ అందుబాటులో ఉంటూ రైతుల నుంచి వచ్చిన అర్జీలు సత్వరమే పూర్తి చేస్తామని ఆమె అన్నారు.

## పెద్ద షాపూర్‌లో యూనిఫాం స్టిచింగ్ సెంటర్ పరిశీలన

**నాణ్యమైన యూనిఫాంలను నిర్ణీత సమయంలో విద్యార్థులకు అందించాలి: అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న యూనిఫాం స్టిచింగ్ సెంటర్‌ను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టిచింగ్ సెంటర్‌లో జరుగుతున్న యూనిఫాం కుట్టు పనుల పురోగతి, సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న వసతులు, యూనిఫాంల నాణ్యత తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. యూనిఫాం కుట్టే విధానం, ఉపయోగిస్తున్న వస్త్రాల నాణ్యత, కొలతలకు అనుగుణంగా కుట్టుపని జరుగుతున్న తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. సెంటర్‌లో రోజువారీగా ఎంతమేర యూనిఫాంలను సిద్ధం చేస్తున్నారు, ఇప్పటివరకు ఎన్ని యూనిఫాంలు కుట్టారు, ఇంకా ఎన్ని యూనిఫాంలు పూర్తి చేయాల్సి ఉంది అనే వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే యూనిఫాంల విషయంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ కె. కిరణ్మయి సూచించారు. కుట్టుపనిలో ఎలాంటి లోపాలు లేకుండా, విద్యార్థుల కొలతలకు అనుగుణంగా యూనిఫాంలను సిద్ధం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా కుట్టుపని పూర్తి చేసి విద్యార్థులకు యూనిఫాంలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టిచింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, మౌలిక వసతులపై కూడా ఆమె ఆరా తీశారు. పనుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనిఫాం స్టిచింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనుల పురోగతిపై అధికారులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంలు సకాలంలో అందుబాటులోకి రావడం ద్వారా పాఠశాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల యూనిఫాం తయారీలో నాణ్యతతో పాటు వేగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, యూనిఫాం స్టిచింగ్ సెంటర్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ, వసతి

**పాల్వంచ విశాల భారతి:** పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ, ఉచిత వసతి కల్పించనున్నట్లు పోలీస్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ శ్రీ రోహిత్ రాజ్, ఐ పి ఎస్ సూచనల మేరకు త్వరలో జరగనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పొందదలచిన అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను పూర్తిగా నింపి, ఆధార్ కార్డు, ఇంటర్మీడియట్ సర్టిఫికేట్ , డిగ్రీ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలను జతచేసి ఆగస్టు 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు సెప్టెంబర్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఉచిత శిక్షణతో పాటు ఉచిత రెసిడెన్షియల్ సౌకర్యం కల్పించి, పోలీస్ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని అధికారులు కోరారు.

## విద్యార్థుల్లో సోదరభావం, దేశభక్తి పెంపొందించడమే రక్షా బంధన్ ఉద్దేశ్యం

- కర్పూరపు తిరుపతిరావు
- "నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనమంతా మన దేశానికి రక్ష"

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



శంషాబాద్ విద్యార్థుల్లో సోదరభావం, ఐక్యత, దేశభక్తి పెంపొందించడమే రక్షా బంధన్ పండుగ ప్రధాన ఉద్దేశ్యమని ఆర్ఎస్ఎస్ శంషాబాద్ నగర సంపర్క ప్రముఖ్ కర్పూరపు తిరుపతిరావు అన్నారు. గురువారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తు రక్షా బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు రాఖీలు కట్టి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్పూరపు తిరుపతిరావు మాట్లాడుతూ రక్షా బంధన్ కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, సమాజంలో పరస్పర రక్షణ, ప్రేమ, ఆత్మీయత, సోదరభావం, ఐక్యతను పెంపొందించే గొప్ప సంస్కారమని పేర్కొన్నారు. "నీవు నాకు రక్ష..నేను నీకు రక్ష.. మనమంతా మన దేశానికి రక్ష" అనే భావన ప్రతి విద్యార్థిలో పెంపొందాలని ఆకాంక్షించారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా విద్యార్థులంతా ఐక్యంగా ఉండాలని, సమాజం మరియు దేశం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. దేశ భద్రత, సమాజ శ్రేయస్సు ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలకు సమాజంలో గౌరవం, రక్షణ కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తిరుపతిరావు సూచించారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను గుర్తించి మంచి పౌరులుగా ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ భావన, సామాజిక బాధ్యత, ఐక్యతను పెంపొందించేందుకు సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్షా బంధన్ పండుగ స్ఫూర్తితో సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పర సహకారం, సోదరభావంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి బత్తుల భరత్, నగర ఉపాధ్యక్షులు క్రిష్, సంయుక్త కార్యదర్శులు తరుణ్, వెంకటేష్, రోహిత్, కళాశాల మహిళా కన్వీనర్ హరిప్రియ, శ్రీకాంత్, శివ, కృష్ణతో పాటు పలువురు విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- శేరిగూడ శ్రీచక్ర కాలేజీలో టీసీఎస్ ఐఓఎన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు
- పరిశీలించిన మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ సమీపంలోని శ్రీ చక్ర కాలేజీలో టిసిఎస్ ఐఒఎన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకానున్న నేపథ్యంలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కే పి వి రాజు,తహసీల్దార్ సునీతరెడ్డి, సిఐ మహేందర్ రెడ్డి గురువారం పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అభ్యర్థుల రాకపోకలు, పరీక్షా కేంద్రం వద్ద కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు సమీక్షించారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులు, వారి వెంట వచ్చే తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వాహనాల రాకపోకలను నియంత్రిస్తామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని డీసీపీ వెల్లడించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో అనవసరంగా వాహనాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, పరీక్షకు వచ్చే విద్యార్థులు సమయానికి కేంద్రానికి చేరుకునేలా ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ జితేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వెల్డింగ్ కార్మికుడు ఆత్మహత్య

**చౌటుప్పల్,విశాల భారతి:** బతుకుతెరువు కోసం సొంత ఊరు వదిలి వచ్చిన ఓ యువ కార్మికుడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన చౌటుప్పల్ పట్టణంలో చోటుచేసుకుంది.

**పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..**

మృతుడు అంబటి జానకిరావు (32), తండ్రి విశ్వనాథం. స్వస్థలం శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, జింకిభద్ర గ్రామం. రెండేళ్ల క్రితం ఉపాధి కోసం చౌటుప్పల్ పట్టణానికి వచ్చి వెల్డింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత 45 రోజులుగా పని దొరకక ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. ఆగస్టు 26వ తేదీ రాత్రి 11:30 గంటల సమయంలో ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తమ్ముడు అంబటి జోగారావు ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ స్పందిస్తూ.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

## జూపల్లికి ఆర్టీఐ ఆహ్వానం

- రవీంద్ర భారతిలో ఆర్టీఐ దినోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరిన కమిటీ.. ఆర్టీఐ కార్యకర్తల సమస్యలపై చర్చ




**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్‌లో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు హైదరాబాద్ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ మంత్రికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులు, పారదర్శక పాలనలో ఆర్టీఐ చట్టం ప్రాధాన్యత, ప్రజల్లో సమాచార హక్కుపై అవగాహన పెంపొందించాల్సిన అవసరంపై కార్యక్రమంలో చర్చించనున్నట్లు డాక్టర్ చంటి ముదిరాజ్ తెలిపారు. అలాగే ఆర్టీఐ చట్టం సమర్థవంతమైన అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, సమాచార హక్కు కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చట్టం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని కమిటీ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరవింద స్వామి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుడ్డేటి ప్రవీణ్, రేపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలకు పరిష్కారం

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తక్షణ స్పందన**





**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలోని దళిత కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తక్షణమే స్పందించారు. గ్రామానికి చెందిన పలువురు దళిత కుటుంబాల సభ్యులు గురువారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వారిని ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. దళితులు, పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఆయనకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు గ్రామ పెద్దలు, దళిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నవజీవన్ రెడ్డిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకున్నారు. ప్రజలతో ఎల్లప్పుడూ మమేకమై హయత్‌నగర్ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నవజీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కూడిన దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ శ్రేణులు ఆకాంక్షించారు.

# జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత

- **మృతదేహాలకు పోస్ట్‌మార్టం ఆలస్యం**
- **ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరి మృతదేహాలకు రాత్రి వరకు పోస్టుమార్టం చేయని వైనం**
- **డ్యూటీ డాక్టర్, సూపరింటెండెంట్, ఆర్ఎంవో అందుబాటులో లేక కుటుంబ సభ్యుల ఆందోళన**






**జహీరాబాద్ - విశాల భారతి**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్ర ఇబ్బందులకు దారితీసింది. కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామం సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, వారి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మృతుల కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఉదయం సుమారు 10.30 గంటలకు ప్రమాదం జరిగినప్పటికీ రాత్రి 8 గంటల వరకు పోస్టుమార్టం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే గంటలు గడుస్తున్నా పోస్టుమార్టం నిర్వహించేందుకు వైద్యులు అందుబాటులోకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలు అందించాల్సిన సమయంలో డ్యూటీ డాక్టర్‌తో పాటు సూపరింటెండెంట్, ఆర్ఎంవో కూడా అందుబాటులో లేరని వారు ఆరోపించారు. దీంతో చికిత్స కోసం వచ్చిన రోగులు, వారి బంధువులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదిలా ఉండగా సజ్జాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు డీసీఎం యజమాని నుంచి నష్టపరిహారం ఇప్పించాలని బంధువులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ జాతీయ రహదారిపై, అనంతరం జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఆందోళన కారణంగా జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదానికి సంబంధించి కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు విషయంలోనూ తమకు న్యాయం జరగలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. కోహీర్ ఎస్ఐ తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం లేదని పేర్కొంటూ జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులు మాట్లాడుతూ తమ కుటుంబాల్లోని ఇద్దరు ప్రాణాలు కోల్పోయినా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. దళితుల ప్రాణాలకు విలువ లేదా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు డీసీఎం యజమాని నుంచి తగిన నష్టపరిహారం ఇప్పించాలని, తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయని కోహీర్ ఎస్ఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడం, పోస్టుమార్టం ఆలస్యం కావడంపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

## జిల్లా ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి :** నిజామాబాద్, ఆగస్టు 27 : సోదర భావానికి ప్రతీక అయిన రక్షా బంధన్ (రాఖీ పండుగ) పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ రాఖీ పండగను సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసాను అందించడం ఈ పండుగ విశిష్టత అని గుర్తు చేశారు. "రాఖీ" కుటుంబ బంధాలను బలోపేతం చేసే వారధి అని అన్నారు. మహిళలకు భద్రత, గౌరవం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని, కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని, ప్రేమానురాగాలను చాటే ఈ పర్వదినం మన సంస్కృతి, ఔన్నత్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. సోదరభావంతో, ప్రేమానురాగాలతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి నాడు రాఖీలు కట్టుకుంటూ జరుపుకునే ఈ వేడుక భారతీయ సాంప్రదాయాల గొప్పదనాన్ని యావత్ ప్రపంచానికి చాటుతుందన్నారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధ్య ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని వారు ఆకాంక్షించారు.

## తీజ్ వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు



**దేవరుప్పుల విశాలభారతి:** మండలంలోని మాదాపురం గ్రామంలో తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి ధన్వంతి లక్ష్మీ నారాయణ నాయక్, ఆమె భర్త డాక్టర్ ధన్వంతి లక్ష్మీ నారాయణ నాయక్ పాల్గొని గిరిజన మహిళలతో కలిసి వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా ధన్వంతి లక్ష్మీ నారాయణ నాయక్ మాట్లాడుతూ.. తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఐక్యతను నింపాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. తీజ్ పండుగ సందర్భంగా మాదాపురం గ్రామ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు దావేర అనిల్, గ్రామ శాఖ అధ్యక్షుడు లకావత్ సురేష్, సర్పంచ్ భాగ్య నాయక్, ఉప సర్పంచ్ యాకు, సజ్జన్, నాగరాజు, సామాజిక మాధ్యమాల సమన్వయకర్త ప్రదీప్, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## సింగరాజుపల్లిలో గ్రామ సభలో ఓటరు జాబితాపై సమీక్ష



**దేవరుప్పుల విశాల భారతి :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి ధన్వంతి లక్ష్మీ నారాయణ, జిల్లా యువజన అభివృద్ధి శిక్షణ సంస్థ సభ్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓటరు జాబితాలో జరిగిన మార్పులు, చేర్పులను పరిశీలించారు. హాజరు కాని ఓటర్లు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు, ఒకటికి మించి నమోదైన ఓట్లు సక్రమంగా గుర్తించారా లేదా అనే అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం కోసం బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అనర్హమైన నమోదులను నిబంధనల ప్రకారం గుర్తించి సరిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దావేర అనిల్, సర్పంచ్ కొండా ఊర్మిళ మల్లారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్ల యాదగిరి, ఉప సర్పంచ్ జోగు అనిల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సజ్జన్, రామచందర్, వేణు, పవన్, వీరేశ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సింగరాజుపల్లి జెడ్‌పీహెచ్ఎస్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





**దేవరుప్పుల విశాల భారతి :** మండలం సింగరాజుపల్లి జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలలో ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు జోగు అనిల్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరుప్పుల మండల ఎస్సై ఊర సృజన్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ.. మనకు ఆపద సమయంలో అండగా నిలిచి, రక్షణగా ఉండే ప్రతి ఒక్కరినీ రక్షకులుగా భావిస్తూ రాఖీ కట్టడం ద్వారా సోదరభావం, పరస్పర ఆప్యాయతను తెలియజేసుకుంటామని తెలిపారు. విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని సోదరభావాన్ని చాటుకున్నారు.అనంతరం ఎస్సై ఊర సృజన్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి, వార్డు సభ్యులు, తాళ్ల పెల్లి వేణు మేడరాజు కొండ అఖిల్ రెడ్డి,పాలడుగు నవనీత, కొంగరి జ్యోతి రాములు, నల్ల పవన్ కళ్యాణ్, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుచిత్ర ఆనంద్, ఉపాధ్యాయులు నిరంజన్, ప్రవీణ, శారద, శ్రీదేవి, ఎల్లయ్య, రంజిత్ రావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో సోదరభావం, మంచి విలువలు, సామాజిక బాధ్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా నిర్వహించిన రక్షాబంధన్ వేడుకలు ఆకట్టుకున్నాయి.




## స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- **సోదర–సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీలు కట్టుకున్న విద్యార్థులు**
- **సోదర–సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీలు కట్టుకున్న విద్యార్థులు**
- **ప్రేమ, ఆప్యాయత, గౌరవం, రక్షణ విలువలను చాటిచెప్పిన విద్యార్థులు**
- **రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించిన పాఠశాల యాజమాన్యం**
- **కుటుంబ బంధాలు, సోదరభావం, ఐక్యతను పెంపొందించుకోవాలని సూచన**
- **ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను అభినందించిన చైర్మన్, ఉపాధ్యాయులు**

**మహబూబాబాద్ విశాల భారతి :**

మహబూబాబాద్‌లోని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని సోదర-సోదరీమణుల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, అనురాగం, గౌరవం, రక్షణ వంటి విలువలను చాటిచెప్పారు. రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబ బంధాలను బలోపేతం చేయడంతో పాటు పరస్పర ప్రేమ, గౌరవం, బాధ్యత వంటి విలువలను చిన్ననాటి నుంచే పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె. చంద్ర మౌళి, ప్రధానోపాధ్యాయులు మధు మాట్లాడుతూ.. రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, కుటుంబ బంధాలు, పరస్పర ప్రేమ, గౌరవం, బాధ్యతలను గుర్తుచేసే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరులను గౌరవిస్తూ ఆప్యాయతతో మెలగాలని, సమాజంలో సోదరభావం, ఐక్యతను పెంపొందించాలని విద్యార్థులకు సూచించారు. వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. సోదర సోదరీమణుల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే బలంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం



- **రూ.53.52 కోట్లతో పట్టణం అభివృద్ధికి ప్రణాళిక**
- **మోగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్ పర్సన్**

**చౌటుప్పల్,విశాల భారతి**

పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే దిశగా చౌటుప్పల్ పురపాలక సంఘం కీలక అడుగు వేసింది. చైర్ పర్సన్ మొగదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం ఏకంగా రూ. 53.52 కోట్ల (రూ. 53,52,23,300/) అంచనా వ్యయ ప్రతిపాదనలకు పరిపాలనా ఆమోదం నిమిత్తం పై అధికారులకు పంపించడం జరిగింది. ఈ సమావేశంలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులు తమ నివేదికలను సమర్పించగా, కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యస్ఐఆర్ కి సంబంధించి వార్డుల్లో బూత్ ల వారీగా, వార్డు బౌండరీల లోపల ఓటర్ల జాబితా ప్రక్రియ చేపట్టాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. 20 వార్డుల అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన, నూతన భవన నిర్మాణాలకు ఈ నిధులు కేటాయించనున్నారు.

**అభివృద్ధి పనుల వివరాలు:**

రూ. 38.00 కోట్లతో మల్టీఫంక్షన్ హాల్, గాంధీ పార్క్ టౌన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం. రూ. 9.65 కోట్లతో నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం.రూ. 2.64 కోట్లతో ఘన వ్యర్థాల నిర్వహణ (డిఆర్సిసి & స్మశాన వాటిక).రూ. 1.90 కోట్లతో 20 వార్డుల్లో 34 అత్యవసర పనులు (రోడ్లు, డ్రైయిన్లు, ఉత్సవాల ఏర్పాట్లు).రూ. 50 లక్షలతో వీధి దీపాల నిర్వహణ.రూ. 44 లక్షలు పారిశుధ్య నిర్వహణ & సేఫ్టీ గేర్.రూ. 36 లక్షలు వేసవి తాగునీటి ఎద్దడి నివారణ. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ గారు మాట్లాడుతూ, "పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, అందరి సహకారంతో ఈ పనులన్నింటినీ త్వరలోనే పూర్తి చేస్తాము" అని ఈ సందర్భంగా తెలిపారు.

## ఈదులకుంటపై అధికారుల సమగ్ర నివేదిక

**చెరువేనని నిర్ధారిస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు నివేదిక సమర్పణ**

**సైబరాబాద్ - విశాల భారతి**

ఖానామెట్ గ్రామ పరిధిలోని ఈదులకుంట పరిరక్షణ విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. చెరువు పరిరక్షణ కోసం సీపీఎం పార్టీ చేపట్టిన పోరాటంలో భాగంగా జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఈదులకుంటకు సంబంధించిన పూర్తి ఆధారాలతో ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసింది.సీపీఎం ఫిర్యాదుపై స్పందించిన జాతీయ హరిత ట్రిబ్యునల్ ఈదులకుంటకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో జిల్లా రెవెన్యూ అధికారి, పర్యావరణ ఇంజినీరు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈదులకుంట ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు అందుబాటులో ఉన్న రికార్డులను సైతం పరిశీలించారు.క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల ఆధారంగా ఈదులకుంట చెరువేనని అధికారులు నిర్ధారించారు. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు సమర్పించారు. అధికారులు చెరువుగా నిర్ధారిస్తూ నివేదిక సమర్పించడంపై సీపీఎం నాయకులు సీ. శోభన్, వీ. మాణిక్యం, కే. కృష్ణ, ఎన్. శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.చెరువు పరిరక్షణ కోసం సాగిస్తున్న పోరాటంలో అధికారుల నివేదిక కీలక పరిణామమని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈదులకుంటను పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వరద నీటిని చెరువులోకి మళ్లించి నింపడంతోపాటు భూగర్భ జలాలను కాపాడేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా

- **పుప్పాలగూడలో మూడు భవనాల కూల్చివేత**





**రాజేంద్రనగర్, విశాల భారతి :** నర్సింగి సర్కిల్-45 పరిధిలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని పుప్పాలగూడలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మూడు అక్రమ భవనాలను గురువారం అధికారులు కూల్చివేశారు. సంబంధిత నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు, ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల సిబ్బంది సమన్వయంతో కూల్చివేత ప్రక్రియను నిర్వహించారు. అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, పట్టణ ప్రణాళిక నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. భవన నిర్మాణాలు చేపట్టే ముందు సంబంధిత అనుమతులు పొందడంతో పాటు మున్సిపల్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ప్రజలకు సూచించారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వాటిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నర్సింగి సర్కిల్-45 పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు కొనసాగిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై అవసరమైన మేరకు కూల్చివేత చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

## రైతుల పచ్చటి పంట భూములకు న్యాయ పరిహారం అందించాలి

- **ఎకరాకు 78 లక్షల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలి**
- **మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసిన భూములు కోల్పోతున్న రైతులు**
- **మంతన్ గౌరెల్లి సర్పంచ్ కొర్ర అరవింద్ నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** శివనగుడెం రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన రైతులు. గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మంతనగౌరిల్లి వెంకపల్లి తండా గ్రామాలకు చెందిన రైతులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. శివనగుడెం రిజర్వాయర్ కింద మంతనగౌరిల్లి వెంకపల్లి తండా గ్రామాలకు చెందిన రైతుల భూములు ప్రభావితమవుతున్నాయి. ఈ భూములు శ్రీమంతగూడ రెవెన్యూ పరిధిలో, మంచాల మండలం, రంగారెడ్డి జిల్లా పరిధిలో సుమారుగా 120 ఎకరాల పచ్చటి పంట పొలాలు ఉన్నాయి.ఈ పచ్చటి పంట పొలాల్లో ఎన్నో సంవత్సరాలుగా రైతులు పంటలు పండిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం శివనగుడెం రిజర్వాయర్ కారణంగా తమ విలువైన వ్యవసాయ భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ఎకరాకు రూ.28 లక్షల నష్టపరిహారం చెల్లించే విషయం తెలియజేసినట్లు రైతులు తెలిపారు. తమ భూముల ప్రస్తుత విలువ ఎకరాకు సుమారు రూ.60 లక్షల నుంచి రూ.78 లక్షల వరకు ఉందని, అటువంటి విలువైన భూములకు కేవలం రూ.28 లక్షల పరిహారం అందించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అందుకు తమ పచ్చటి పంట భూములకు ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని న్యాయమైన, సముచితమైన నష్టపరిహారం అందేలా ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని రైతులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే సానుకూలంగా విని, సమస్యను పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంతనగౌరిల్లి గ్రామ సర్పంచ్ కొర్రా అరవింద్ నాయక్ మంతనగౌరిల్లి గ్రామ రైతులు, వెంకపల్లి తండా రైతులు పాల్గొన్నారు.

## గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో పై విద్యార్థులకు అవగాహన




**చౌటుప్పల్,విశాల భారతి:** మండలం తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపియు) మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ & స్కోప్ (స్కోప్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపియు సోషల్ వర్కర్ ఎం.మత్స్యగిరి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోందని, పిల్లలు వాటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపులు జరిగితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటారని, ప్రస్తుతం పిల్లలపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో శిక్షలు మరింత కఠినతరం చేశారని తెలిపారు. అదేవిధంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. పిల్లలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 మరియు అత్యవసర సహాయ నంబర్ 112 కు సమాచారం అందించాలని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని వివరించారు. అనంతరం విద్యార్థులందరితో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. బాలల రక్షణకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. భార్గవి, స్కోప్ సంస్థ ప్రతినిధి బి. నరసింహ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లికార్జున ఉన్నత పాఠశాలలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

- **సోదర ప్రేమకు ప్రతీక రాఖీ పండుగ - చైర్మన్ మారేపల్లి మల్లారెడ్డి**

**చౌటుప్పల్, విశాల భారతి:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని మల్లికార్జున ఉన్నత పాఠశాలలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడిగె కన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్ మారేపల్లి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు విద్యాసంస్థల డైరెక్టర్లు ధరణి, శ్రావ్య, తేజస్విని పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూ సాంప్రదాయబద్ధంగా ఉపాధ్యాయులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, స్వీట్లు పంచుకుని వేడుకను సంబరంగా జరుపుకున్నారు. అనంతరం చైర్మన్ మారేపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ "రక్షా బంధన్ అనేది అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న పవిత్రమైన ప్రేమకు, రక్షణ బంధానికి ప్రతీక. 'రక్ష' అంటే రక్షించడం, 'బంధన్' అంటే బంధం. సోదరిని జీవితాంతం కాపాడుతానని సోదరుడు ఇచ్చే హామీకి ఇది గుర్తు. శ్రావణ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ పండుగ కేవలం రక్తసంబంధానికే పరిమితం కాదు, ప్రేమను, ఆప్యాయతను పంచుకునే ప్రతి ఒక్కరి మధ్య బంధాన్ని బలపరుస్తుంది. సమాజంలో సద్భావనను పెంచడానికి ఇలాంటి పండుగలు ఎంతో దోహదపడతాయి" అని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, యాదయ్య, యాదగిరి, వినీత, ఆనంద్, గౌరీ, ఫౌజియా, పల్లవి, శ్రీజ, సంతోష, శ్రీలత, ఉమ, మౌనిక, పూజ, రజిత తదితరులు మరియు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.



విశాల భారతి



## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**మునగాల (విశాలభారతి):** మునగాల మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత పాఠశాల దుస్తులు, అభ్యాస పుస్తకాలను ఘనంగా పంపిణీ చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి శ్రీ పి. వెంకటేశ్వర్లు, సహాయక పథక అధికారి కరుణాకర్ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజూ బడికి వచ్చి, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వాడుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నిజం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అభ్యాస పుస్తకాలను బాగా సాధన చేయాలని ప్రధానాచార్యులు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు శ్రీ కె. వీరబాబు, ఉపాధ్యాయులు జే. రామకృష్ణ, బి. సైదయ్య గౌడ్, బి.ఎస్. గౌడ్, పి. వెంకటేశ్వర్లు, ఎస్.కె. జానీ, ఎస్.కె. జాకీర్, జి.ఎస్.వి.ఎస్. రావు, ఎన్. రామలింగాచారి, పి. సుస్మిత, ఎస్.కె. జాన్ పాషా, సి.హెచ్. వాణిశ్రీ, కె. సైదులు, కె. గాయత్రి, ఎస్.కె. రంజాన్ బేగం, సి.హెచ్. రమేష్, ఎం. వెంకటేశ్వర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## సెప్టెంబర్ 1న ఎక్సైజ్ వాహనాల బహిరంగ వేలం

- ఎక్సైజ్ శాఖ సీఐ చిరంజీవి



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి):** సారాయి, బెల్లం సరఫరా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సెప్టెంబర్ 1న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ జి. చిరంజీవి తెలిపారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ హెచ్. దత్తురాజ్ గౌడ్, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి పి. కరంచంద్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1న ఉదయం 11 గంటలకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో డీపీఈఓ మహబూబాబాద్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ చిరంజీవి పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు వాహనం నిర్ణయించిన ధరలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. వేలం వేయనున్న వాహనాల వివరాలు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు ముందుగా వాహనాలను పరిశీలించుకుని వేలంలో పాల్గొనవచ్చని సూచించారు. వేలంలో వాహనం దక్కిన అనంతరం దానిని తీసుకోకపోతే సంబంధిత వ్యక్తి డిపాజిట్ మొత్తాన్ని జప్తు చేస్తామని సీఐ చిరంజీవి స్పష్టం చేశారు. వేలంలో వాహనం దక్కని వారికి డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటల వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. వేలంలో వాహనం దక్కించుకున్న వారు అదే రోజు పూర్తి మొత్తాన్ని జీఎస్టీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని సీఐ చిరంజీవి తెలిపారు.

## బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా నగేష్ గౌడ్



**మునగాల (విశాలభారతి):** బీసీ ఉద్యమ రథ సారథి, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు బీసీ యువజన సంఘం మునగాల మండల అధ్యక్షుడిగా తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాలబోయిన నగేష్ గౌడ్‌ను నియమించారు. గురువారం నాడు జిల్లా కమిటీల ఇంచార్జ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన బాలబోయిన నగేష్ గౌడ్ మాట్లాడుతూ... గ్రామగ్రామాన బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఉద్ఘాటించారు. తన నియామకానికి సహకరించిన డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్, పచ్చిపాల రామకృష్ణ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా రెండు లారీలు సీజ్



**చౌటుప్పల్,విశాల భారతి**: యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పోలీసుల తనిఖీల్లో భారీగా అక్రమ ఇసుక రవాణా పట్టుబడింది. గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో మల్కాపురం గ్రామ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆంధ్రప్రదేశ్ నుండి హైదరాబాద్ కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నారు.

**పట్టుబడిన వివరాలు:** లారీ నెం. AP 39 WC 6179, 69.77 టన్నుల ఇసుక, డ్రైవర్ ఎస్.కె. బాబావలి. లారీ నెం. AP 37 UG 3889,71.49 టన్నుల ఇసుక, డ్రైవర్ జానీ భాష మొత్తం 141.26 టన్నుల ఇసుకను, రెండు లారీలను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై మైన్స్ అండ్ జియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, యాదాద్రి భువనగిరి కె. రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ తెలిపారు.

## విజయరాఘవాపురంలో 'సర్' సభ



**మునగాల (విశాలభారతి):** మండల పరిధిలోని విజయరాఘవాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమంపై గ్రామ సభను నిర్వహించారు.ఈ సభలో గ్రామ సర్పంచ్ సుంకర పిచ్చయ్య, ఉప సర్పంచ్ కత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో తప్పుల సవరణకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిపాలన అధికారి, పంచాయతీ కార్యదర్శి, బిఎల్ఓ లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ వేళ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో సోదరభావం వెల్లివిరిసింది



**చౌటుప్పల్,విశాల భారతి:** రాఖీ పండుగను పురస్కరించుకుని చౌటుప్పల్‌లోని విద్యార్థులు పోలీసులకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**మల్లికార్జున స్కూల్ విద్యార్థుల ఆత్మీయత:**

మల్లికార్జున స్కూల్ విద్యార్థులు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ జి. మన్మధ కుమార్, ఎస్ఐలు కే. యాదగిరి, అజయ్ భార్గవ్ మరియు సిబ్బందికి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలను విద్యార్థులు అభినందించారు.

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నలంద కళాశాల విద్యార్థులు:**

అదేవిధంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నలంద కళాశాల విద్యార్థులు కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు రాఖీలు కట్టారు. చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.మన్మధ కుమార్ తో పాటు ఎస్ఐలు కే. యాదగిరి, కృష్ణ మాల్, రవీందర్, అజయ్ భార్గవ్ లకు రాఖీ కట్టి, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను కొనియాడారు. రాఖీ పండుగ సోదరభావానికి, ఆప్యాయతకు ప్రతీక అని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోలీసులు విద్యార్థుల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేస్తూ ఈ కార్యక్రమం ఆత్మీయంగా సాగింది.

# రోడ్డు పైకి గ్రామసభ.. ఇదేనా పాలన తీరు?

- బేతోలులో అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ప్రజా సమస్యలపై చర్చించేందుకు భవనం కూడా కరువు
- ప్రజా సమస్యలపై చర్చించాల్సిన గ్రామసభే రోడ్డున పడింది.. ఇదేనా పాలనా తీరు?
- ప్రభుత్వ భవనాలు ఉన్నా ఉపయోగం లేదు
- అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపైనే గ్రామసభ
- శిథిలావస్థకు చేరిన భవనాలు.. పిచ్చిమొక్కల మధ్య ప్రజలకు తప్పని అవస్థలు.
- కనీస సౌకర్యాలు కల్పించలేని అధికారులపై బేతోలు గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం
- ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన భవనాలు నిరుపయోగం.. ఉన్నతాధికారులు స్పందించాలి




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

ప్రజా సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన గ్రామసభే రోడ్డున పడింది. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలులో గురువారం ఎస్ఐఆర్ ఫేజ్ 2, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభను అధికారులు రోడ్డుపక్కనే నిర్వహించాల్సి వచ్చింది. గ్రామంలో ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ అవి వినియోగానికి పనికిరాని స్థితికి చేరడంతో ప్రజలను రోడ్డుపై కూర్చోబెట్టి గ్రామసభ నిర్వహించడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

**ప్రభుత్వ భవనాలు ఉన్నా.. గ్రామసభకు రోడ్డే దిక్కు.**

బేతోలులో ప్రభుత్వ భవనాలు ఉన్నా వాటి నిర్వహణపై అధికారులు కనీస శ్రద్ధ చూపకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి, వర్షపు నీరు నిలిచిపోయి అధ్వానంగా మారాయి. ప్రజలు కూర్చునేందుకు, సమావేశం నిర్వహించేందుకు కనీస వసతులు లేకపోవడంతో చివరకు రోడ్డుపక్కనే కుర్చీలు వేసి గ్రామసభ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ప్రజల సమస్యలపై చర్చించాల్సిన సభ.. రోడ్డుపైనే.**

గ్రామంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరేందుకు ఏర్పాటు చేసే గ్రామసభకు కూడా సరైన వేదిక లేకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించలేని పాలనా యంత్రాంగం ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తుందని నిలదీస్తున్నారు.

**ప్రజాధనం ఖర్చు.. భవనాలు మాత్రం నిరుపయోగం.**

ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ నిర్వహణ లేక భవనాలు క్రమంగా శిథిలావస్థకు చేరుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ నిధులతో భవనాలు నిర్మిస్తుండగా.. మరోవైపు వాటిని వినియోగించుకోలేని పరిస్థితి రావడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు.

**ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొనాలి.**

బేతోలు గ్రామంలోని ప్రభుత్వ భవనాల దుస్థితిపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, గ్రామంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు. ఇకపై ప్రజల సమస్యలను చర్చించే గ్రామసభలు రోడ్డుపై కాకుండా గౌరవప్రదమైన వేదికల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల కోసం నిర్వహించాల్సిన గ్రామసభే రోడ్డున పడితే.. పాలన ఎక్కడ ఉందో, అధికారుల బాధ్యత ఎక్కడ ఉందో ప్రశ్నించాల్సిన పరిస్థితి ఏర్పడిందని బేతోలు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి భేటీ

- నియోజకవర్గ అభివృద్ధి పై చర్చ .. సీఎంను శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డా. ఆర్. భూపతి రెడ్డి బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. భేటీలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి చర్చించారు. నియోజకవర్గంలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, వాటి అమలు తీరు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన భవిష్యత్ అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## గ్రామ సభ లో సమగ్ర ఓటరు ముసాయిదా

**మోతె ఆగస్టు 27 విశాల భారతి**

గురువారం మండల మండల కేంద్రంలో గ్రామ సభ నిర్వహించటం జరిగిందని తెలంగాణరాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ ముసాయిదా లో ఉన్న కొన్ని సవరణలు తెలియజేస్తూ గ్రామ సభలు పెట్టి ఓటర్లకు పూర్తి వివరాలు తెలియజేస్తూ ఓటు మ్యాపింగ్ చేసిన వారి వివరాలు ఓటు మ్యాపింగ్ చేయని వారి వివరాలు చదివి వినిపించటం జరిగిందని బి యల్ ఓ దోసపాటి పద్మ తెలియజేశారు ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకొని వారు తప్పకుండ కొత్త ఓటర్లు మీ ఓటు ను నమోదు చేసుకోవాలని ఓటరు సమగ్ర ముసాయిదా లో పూర్తి స్థాయి లో గ్రామం లో ఉన్న ప్రతి ఒక్కరు మీ ఓటు హక్కు ను పొందే విధంగా చూచుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ దోసపాటి అనురాధ కార్యదర్శి ఆఫ్రాన్ బి యల్ ఓ లు దోసపాటి పద్మ , సైదులు వార్డు మెంబర్లు దోసపాటి బబ్లు, భద్రమ్మ , నవీన్, బి యల్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.




## మియాపూర్ డీఏవీ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**సోదరభావాన్ని చాటిన విద్యార్థులు**

**మియాపూర్ - విశాల భారతి**

మియాపూర్ లోని మాతృశ్రీ డీఏవీ పబ్లిక్ స్కూల్ లో రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకుని సందడి చేశారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆనందవల్లి ముఖ్య అతిథిగా హాజరై రక్షాబంధన్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధానికి, రక్షణకు ప్రతీక ఈ పండుగ అని, భారతీయ సంస్కృతిలో దీనికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. సోదరభావంతో, ఐక్యతతో మెలగాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా




విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రంగు రంగుల రాఖీలను ప్రదర్శించారు. చిన్నారుల సృజనాత్మకత అందరినీ ఆకట్టుకుంది.కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిమబిందుసాగర్, హిమబిందుతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్కల దాడిలో 13 మందికి గాయాలు





**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** / మోర్తాడ్: మోర్తాడ్ మండల కేంద్రంలోని పలు వీధుల్లో వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేయడంతో 13 మంది గాయపడ్డారు . గాయ పడినా వారికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స చేయించుకున్నారు. ఈ దాడిలో 8 ఏళ్ల బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిచ్చికుక్కలు స్వైరవిహారంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానిక అధికారులు వెంటనే చర్యలు తీసుకోనీ ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి

**కలెక్టర్ భవేష్ మిశ్రా హితవు.. ఓటర్లకు నోటీసులు అందజేస్తున్న విధానం పరిశీలన**



**నిజామాబాద్ జిల్లా, విశాల భారతి:** నిజామాబాద్, : అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగని వారికి, పేరు, వయసు వంటి అంశాలలో వ్యత్యాసం కలిగి ఉన్న ఓటర్లకు హియరింగ్ కు రావాలని కోరుతూ బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ పరిధిలో గల కంఠేశ్వర్ లో సిబ్బంది ఇంటింటికి తిరిగి నోటీసులు అందిస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలన జరిపారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బీ.ఎల్.ఓ, సూపర్వైజర్లు అందుబాటులో ఉన్నారా లేదా అన్నది గమనించారు. వారు విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమందికి నోటీసులు అందించారు, ఇంకా ఎంత మందికి ఇవ్వాల్సి ఉన్నది, పోలింగ్ కేంద్రం పరిధిలో మ్యాపింగ్ జరగని ఓటర్లు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధృవీకరణ అవసరం ఉన్న ఓటర్ల ఇంటింటి స్వయంగా వెళ్లి నోటీసులు అందించాలని, సూచించిన సమయానికి ఒకవేళ వారు రాలేకపోతే మరోమారు నోటీసు ఇవ్వాలని సూచించారు. నోటీసు అందించే సమయంలోనే ఎవరైనా ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించవచ్చని అన్నారు. నిర్ణీత గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీ.ఎల్.ఓ సూపరింటెండెంట్ మురళి, బీ.ఎల్.ఓ లావణ్య తదితరులు ఉన్నారు.

## కలప ధరల పెంపునకు టింబర్ డిపో ఓనర్ల నిర్ణయం



**కోదాడ, విశాలభారతి:** ముడిసరుకు లభ్యత కష్టంగా మారడం, కార్మికుల కూలీలు పెరగడంతో సామిల్ మరియు టింబర్ డిపో ఉత్పత్తుల ధరలను పెంచాలని నిర్ణయించినట్లు కోదాడ సామిల్ అండ్ టింబర్ డిపో ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమల్లు నరసింహాచారి తెలిపారు. గురువారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో యజమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలప దొరకకపోవడం, రవాణా మరియు కార్మికుల ఖర్చులు పెరగడంతో వ్యాపారం నిర్వహించడం భారంగా మారిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సెప్టెంబర్ 1 నుంచి పెంచిన కొత్త ధరలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గొల్లపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శి కొల్లూరి వేణుగోపాల్, కోశాధికారి గొల్లపల్లి బాలకృష్ణ, పమ్మి ఉపేంద్రచారి, పమ్మి నాగ బ్రహ్మచారి, లక్ష్మణరావు, ఇటికాల శివబ్రహ్మచారి, భరత్ పటేల్, కొత్త శంకర్, అనంతరాములు, రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ సందర్భంగా వృక్షబంధన్

**మరిపెడ విశాల భారతి:** రక్షాబంధన్ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరిపెడలో గురువారం "వృక్షబంధన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అనంతరావు, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు బయగాని రామ్మోహన్, గ్రీన్ గైడ్ టీచర్ రాజకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు చెట్లకు సహజ పదార్థాలతో తయారు చేసిన రాఖీలు కట్టారు.ఈ సందర్భంగా చెట్లు మన కుటుంబ సభ్యులు.. వాటి సంరక్షణ మన బాధ్యత అంటూ విద్యార్థులు ప్రకృతి పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎర్త్ లీడర్స్, విద్యార్థులు పాల్గొన్నారు



# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలి

- ప్రతి నెల సివిల్ రైట్స్ డేను పక్కాగా నిర్వహించాలి
- సాంఘిక బహిష్కరణ ఘటనలపై కఠినంగా వ్యవహరించాలి
- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**



నిజామాబాద్, ఆగస్టు 27 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతి పై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బందీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సహాయ సహకారాల విషయంలో ఎలాంటి జాప్యం జరుగకుండా చూడాలన్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ, తదితర శాఖల కార్యాలయాల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన నివేదికలను, లేఖలను అందజేయాలని సూచించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని, దళిత, గిరిజన వర్గాల ప్రజల హక్కులపై వారికి అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జీవనాధారం కోసం ప్రభుత్వం అందజేసిన అసైన్డ్ భూములను ఎవరైనా కబ్జా చేసినట్లైతే తమ దృష్టికి తేవాలని, బాధితులకు భూభారతి చట్టం ద్వారా న్యాయం జరిగేలా కృషి చేస్తామని కలెక్టర్ సూచించారు. కాగా, గ్రామాలలో సాంఘిక బహిష్కరణలు వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి రజిత, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ, వసతి

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- పాల్వంచ రూరల్ ఎస్సై బి సురేష్




**పాల్వంచ రూరల్ ఆగస్టు 27: విశాలభారతి :** పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నట్లు రూరల్ ఎస్సై బి.సురేష్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐపీఎస్ సూచనల మేరకు కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ నియామక పరీక్షల్లో అభ్యర్థులు మెరుగైన ప్రతిభ కనబరిచేలా పోటీ పరీక్షలకు అవసరమైన అంశాలపై నిపుణులతో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ వసతి సైతం కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నిరుద్యోగ యువతకు ఈ అవకాశం ఎంతో ఉపయోగకరమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై బి.సురేష్ సూచించారు.ఆగస్టు 30లోగా దరఖాస్తులు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను పూర్తిగా నింపి ఆధార్ కార్డు, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతులను జత చేసి ఆగస్టు 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెప్టెంబర్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తామని ఎస్సై సురేష్ స్పష్టం చేశారు.

## రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు 20 పతకాలు




**పాల్వంచ విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో , హన్మకొండ, జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిన్నటితో ముగిసిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ప్రతిభ కనబర్చి మొత్తం ఇరవై పతకాలు సాధించారని ఇందులో ఏడు బంగారు, ఆరు రజత, ఏడు కాంస్య పతకాలు గెలుచుకునరని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ తెలిపారు. చర్ల కు చెందిన ఎం శ్రీ విద్యా దొర 80 మీటర్ల హర్డల్స్ పరుగుపందెంలో మరియు లాంగ్ జంప్ లో రెండు బంగారు పతకలు గెలుపొందారు, కరకగూడెం కు చెందిన శ్రీ తేజ హెప్తాతలోన్ లో బంగారు పతకం, కొత్తగూడెం కు చెందిన సిహెచ్.వేదశ్రీ షాట్ పుట్ లో బంగారు పతకం, భద్రాచలంకి చెందిన ఎస్కే.అఫ్రిన్ జావీలిన్ లో బంగారు పతకం మరియు షాట్ పుట్ లో రజతపతకం, బి. పృధ్వీక జావీలిన్ లో బంగారు పతకం, పాల్వంచ కు చెందిన ఆర్ అభినవ నాయక్ హై జంప్లో బంగారు పతకం మరియు డెకతలోన్ లో రజత పతకం,4x100 రిలే లో అభినవ్, వినయ్, విగ్నేష్, వరుణ్ లు బంగారు పతకం, సిద్ధి వినయ్ హై జంప్ లో రజిత పతకం మరియు త్రిపుల్ జంప్ లో కాంస్య పథకం, పాల్వంచకు చెందిన ఎం. నాగేశ్వరి 5000 మీటర్ల పరుగుపందెం లో రజిత పథకం, బి. సౌమ్య, జావీలిన్ త్ర్ లో రజిత పథకం,కాచన పల్లి కి చెందిన ఈ. సమీరా ట్రయతలోన్ లో కాంశ్య పతకం, దమ్మపేటకు చెందిన ఎం కావ్య హై జంప్ లో రజత పథకం, పాల్వంచకు చెందిన ఎం దివ్య లాంగ్ జంప్ లో కాంస్య పథకం కొత్తగూడెంకు చెందిన కే. ఆనంద్ కిడ్స్ జావీలిన్ లో కాంస్య పథకం, జి. కుమార, డిస్కస్ త్ర్ లో కాంస్య పథకం, వి. పల్లవి, షాట్ పుట్ లో కాంస్య పతకం, ఎం. విగ్నేష్ 800 మీటర్ల పరుగు పందెం లో కాంస్య పతకం గెలుపొందరని తెలిపారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి మరియు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. సారంగపాణి విజేతలను మరియు అథ్లెటిక్స్ కోచ్‌లు పి. నాగేందర్,ఎం. నాగరాజు మల్లికార్జున్, జన్ను గిరి ప్రసాద్ , వారి కృషికి ప్రత్యేకంగా అభినందించారు.1

## పాల్వంచలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ




**పాల్వంచ విశాల భారతి:** ఖమ్మంకు చెందిన గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పాల్వంచ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పలకలు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాల్వంచ మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) శ్రీ రామ్ మూర్తి హాజరై విద్యార్థులకు తన చేతుల మీదుగా విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామ్ మూర్తి మాట్లాడుతూ, పేద మరియు అవసరమైన విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రేస్ సర్వీస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, నోట్ బుక్స్, పలకలు అందించడం ద్వారా వారి చదువుకు ఎంతో ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. సమాజ సేవా దృక్పథంతో సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కేటీపీఎస్ 'ఎ' కాలనీ, వెంగళరావు నగర్, ప్రశాంత్ నగర్, పాండురంగాపురం, సూరారం, వై.పి. తండా, శాంతి కాలనీ, బి.టి. కాలనీ, గట్టాయిగూడెం, సీతారాంపట్నం, కొమ్ముగూడెం, కరకవాగు, వీపూరు, జగన్నాధపురం, బస్టాండ్, సంజయ్ నగర్, గుడిపాడు, పి. యానంబైలు, యానంబైలు, రాజుపురం ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రేస్ సర్వీస్ సొసైటీ అందిస్తున్న సహకారాన్ని పలువురు అభినందించారు.



## యశోదలో శివప్రతాప్ శుక్లాను పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులతో చికిత్స వివరాలపై చర్చ**

**సైబరాబాద్ విశాల భారతి:** అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం స్వయంగా పరామర్శించారు. ఆస్పత్రికి చేరుకున్న సీఎం గవర్నర్ గదిలోకి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్య బృందంతో సుదీర్ఘంగా చర్చించి,వైద్య సేవలపై వివరాలు సేకరించారు.గవర్నర్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో పాల్గొనాలని సీఎం ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి తో పాటు ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను పరామర్శించారు. వైద్యులు, అధికారుల నుంచి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం తీసుకున్నారు.గవర్నర్ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నారని తెలిసిన వెంటనే సీఎం స్వయంగా వెళ్లి పరామర్శించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే గవర్నర్‌కు ఏమైంది, ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందన్న వివరాలను ఆస్పత్రి వర్గాలు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.పూర్తి వైద్య బులెటిన్ వెలువడాల్సి ఉంది.

## సెప్టెంబర్ 1న చలో కొత్తగూడెం సదస్సును జయప్రదం చేయాలి

**పాల్వంచ విశాల భారతి:**



సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో నిర్వహించనున్న కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని భవన నిర్మాణ అడ్డాల్లో నిర్వహించిన గ్రూప్ మీటింగ్‌లలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చలో కొత్తగూడెం సదస్సుకు సంబంధించిన ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి, జేవీబీఎన్, నవభారత్, మున్సిపల్, జీపీ, హాస్టల్, హాస్పిటల్, స్కీమ్ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. 2013 జనవరి నుంచి సింగరేణిలో హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ అమలు చేయడం లేదని అన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా పెరగాల్సిన వేతనాలను తగ్గిస్తూ మున్సిపాలిటీల్లో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని విభాగాలకు చెందిన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు సెప్టెంబర్ 1న నిర్వహించే "చలో కొత్తగూడెం" సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించేలా పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సదస్సు వివరాలు: సెప్టెంబర్ 1న కొత్తగూడెంలోని సెర్ క్లబ్‌లో ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహించనున్నారు. ముఖ్య వక్తలుగా సాదినేని వెంకటేశ్వరరావు, కన్నెగంటి రవి, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారు.

## కిండర్ క్లేలో రక్షాబంధన్

- చిన్నారుల్లో సోదరభావం పెంపొందించేలా వేడుకలు
- సంప్రదాయాలపై అవగాహన కల్పించిన పాఠశాల

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పర్వదినాల ప్రాశస్త్యాన్ని చిన్నారులకు తెలియజేసే ఉద్దేశంతో కొత్తపేట కిండర్ క్లే పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం విద్యార్థులు తమ సోదరీమణులకు బహుమతులు అందజేశారు. రక్షాబంధన్ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించారు. వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల చిన్న వయసు నుంచే అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.





## మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా బంగారు మైసమ్మ తల్లి కి బోనాలు

- మార్కెట్ కమిటీ అధ్యక్షులు బాష్పంగు వెంకటేశ్వర్లు



**మరిపెడ, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ని కొలువున్న బంగారు మైసమ్మ తల్లికి కూరగాయల మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగను జరుపుకున్నారు ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అధ్యక్షులు బాసిపంగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మరిపెడలో కూరగాయల మార్కెట్ లో కొలువుదీరిన బంగారు మైసమ్మ తల్లికి ప్రతి సంవత్సరం బోనాల చెల్లించుట ముక్కుబడులు తీర్చుకుంటూ వస్తున్నాము ఈ బంగారు మైసమ్మ తల్లి నీ కోరుకుంటే కొంగు బంగారం అవుతుందన్నారు బంగారు మైసమ్మ తల్లి దీవెనలతో మార్కెట్ యూనియన్ వారందరూ సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పత్రుమియా యూనియన్ మెంబర్లు మలికాంబ, పద్మ, రాజు, లచ్చమ్మ, నాయుడు,తదితరులు పాల్గొన్నారు

## రవాణా రంగ సమస్యలను పరిష్కరించాలి



**కోదాడ, విశాలభారతి:** రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కోదాడకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డిలను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న రేడియం స్టిక్కర్ల విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య లారీ రవాణా సజావుగా సాగేందుకు సింగిల్ పర్మిట్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు జాతీయ రహదారుల వెంట ప్రతి 100 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ పాయింట్‌ను ప్రభుత్వమే ఏర్పాటు చేసి, సబ్సిడీ ధరలతో సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు పోలీసుల ఇచలానాల వేధింపులు తగ్గించాలని, అదనంగా పెంచిన ఫిట్‌నెస్ చార్జీలను తగ్గించి రవాణా రంగాన్ని ఆదుకోవాలని కోరారు.

## విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



**కోదాడ, విశాలభారతి:** సూర్యాపేట జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కోదాడ పట్టణానికి చెందిన కాంపటి శ్రీనివాస్ నియమితులయ్యారు. గురువారం కోదాడలో స్థానిక శాసనసభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కాంపటి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు, బాధితులకు న్యాయం జరిగేలా చట్ట ప్రకారం వారికి అందాల్సిన సహాయ పునరావాస చర్యలు సక్రమంగా అమలు జరిగేలా తన వంతు కృషి చేస్తానని, బాధితులకు అండగా ఉంటూ కమిటీ లక్ష్యాల సాధనకు శ్రమిస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు. కాగా కాంపటి శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు నాయకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## సౌమ్య విద్యామందిర్ పాఠశాలలు ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**రక్షాబంధన్ సోదరభావానికి ప్రతీక,ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్**



**చిట్యాల,విశాల భారతి:** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ (SVM) పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు తమ సహచర విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రక్షాబంధన్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యతకు ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, వారిలో మానవీయ విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఒకరినొకరు గౌరవించుకుంటూ స్నేహభావంతో మెలగాలని, చిన్నతనం నుంచే క్రమశిక్షణ, మంచి ప్రవర్తన, బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, మునుకుంట్ల వేణు, మునుకుంట్ల స్వాతి, గంధమల్ల చర్విత, రేగులగడ్డ ప్రశాంతి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో పారదర్శక పాలన కోసం అఖిలపక్ష కౌన్సిలర్ల నిరసన



**చౌటుప్పల్,విశాల భారతి:** ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన కోసం చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్లు అఖిలపక్షంగా ఏకమయ్యారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వార్డు కౌన్సిలర్లు నిరసనకు దిగారు. కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి, కార్యాలయం ఎదుట శాంతియుతంగా ఆందోళన చేపట్టారు. మున్సిపల్ పరిపాలనలో పారదర్శకత పాటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ మినిట్ బుక్, ఎంపీ రికార్డు, తొలి కౌన్సిల్ సమావేశ తీర్మానాల ప్రతులను చూపించాలని కోరినా స్పందించడం లేదని తెలిపారు. ప్రజాప్రతినిధులు అడిగిన రికార్డులను అందుబాటులో ఉంచకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయ మరమ్మతుల పేరుతో విడతల వారీగా ఖర్చు చేసినట్లు చెబుతున్న రూ. 40 లక్షల నిధుల వినియోగంపై పూర్తి వివరాలు అందించాలని కోరారు. మున్సిపాలిటీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తే అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలని, నిబంధనల ప్రకారం కౌన్సిలర్లను భాగస్వామ్యం చేస్తూ పాలన సాగించాలని, రికార్డులు, పనుల వివరాలు పారదర్శకంగా అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ బుద్ద సురేష్, వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం, పోలేపల్లి లక్ష్మీ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# ఎవరి చేతిలోనూ కీలుబొమ్మను కాను!

రాజకీయాల కంటే సినిమాకే తన తొలి ప్రాధాన్యత అని చెప్పింది అగ్ర కథానాయిక కంగనారనౌత్. రెండేళ్ల పొలిటికల్ కెరీర్ కంటే 20 ఏళ్ల సినీ ప్రస్థానమే తనకు ఎక్కువ గుర్తింపును తీసుకొచ్చిందని వ్యాఖ్యానించింది. తాజా ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. 'నేను బీజేపీ పార్టీ విధానాల నుంచి పక్కకు వెళ్లాలని ఎప్పుడూ అనుకోను. కానీ ఒకవేళ అలా జరిగితే నేను ఎవరి చేతిలో కీలుబొమ్మను కాదనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. నేడు నాకు పార్టీ అండగా ఉంది. రేపు ఉండకపోవచ్చు. ఎంపీగా రెండేళ్ల రాజకీయం కంటే 20 ఏళ్ల నటప్రయాణమే నాకు ఎక్కువ పేరు తీసుకొచ్చింది. ఇప్పటికీ ఎంతో మంది దర్శకులు నాకోసం ఎదురుచూస్తున్నారు. సినిమాపరంగా ఇంకా చేయాల్సింది, సాధించాల్సింది చాలా ఉంది' అని కంగనారనౌత్ పేర్కొన్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.